ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY

5

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు

జిల్లా వార్తలు

ఆదివారం 19 మే 2024



22న జిల్లాకు గవర్నర్ రాక

నెల్లూరు(హరనాథపురం): రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ ఈనెల 22న జిల్లా పర్యటనకు రానున్నారని కలెక్టర్ హరినారాయణన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం జరిగే విక్రమ సింహపురి యూనివర్సిటీ స్నాతకోత్సవంలో ఆయన పాల్గొంటారని తెలిపారు. ఈనెల 22న ఉదయం 9.45 గంటలకు గన్నవరం నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 10.45 గంటలకు నెల్లూరు పోలీసు పరేడ్ మైదానానికి చేరుకుంటారని, 11.30 నుంచి మధ్యాహ్నం 12.55 వరకు జరిగే వీఎస్‌యూ స్నాతకోత్సవంలో పాల్గొంటారని తెలిపారు. అనంతరం సాయంత్రం 5.35 గంటలకు పోలీసు పరేడ్ మైదానం నుంచి హెలికాప్టర్‌లో గన్నవరం చేరుకుంటారని తెలిపారు.





పెంచలకోనలోని నృసింహుడి ఆలయం (ఇన్‌సెట్‌లో) స్వామి, అమ్మవార్లు

నేటి నుంచి నృసింహుడి బ్రహ్మోత్సవాలు

- ముస్తాబైన పెంచలకోన
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- వివిధ జిల్లాల నుంచి 120 ప్రత్యేక బస్సులు
- భక్తులకు త్వరితగతిన దర్శనం: ఉప కమిషనర్
- అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు

రాపూరు(డక్కిలి), మే 18: రాపూరు మండలంలోని పెంచలకోనలో ఆదివారం నుంచి నృసింహుడి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఇందుకు పెంచలకోన ముస్తాబైంది. ఉత్సవాల్లో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ఉప కమిషనర్ సాగర్‌బాబు, ఆర్డీవో మాలోల తదితరులు ఏర్పాట్లు చేశారు.

గోనుపల్లి నుంచి ఉత్సవమూర్తుల రాక

ఆదివారం నుంచి ఈనెల 25వ తేదీవరకు జరిగే బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం గోనుపల్లి నుంచి శోభాయాత్రగా పెంచలకోనకు ఉత్సవమూర్తులు రానున్నారు. అనంతరం అంకురార్పణ, రాత్రి సేనాపతి ఉత్సవం నిర్వహిస్తారు. 20న ఉదయం స్వామివారికి పట్టువస్త్రాల సమర్పణ, ధ్వజారోహణ, రాత్రికి శేషవాహన సేవ, 21న ఉదయం హంస వాహనసేవ, రాత్రికి బంగారు హనుమంత సేవ, 22న ఉదయం సింహవాహన సేవ, రాత్రికి నృసింహ జయంతి సందర్భంగా బంగారు గరుడసేవ నిర్వహిస్తారు. 23న ఉదయం తిరుకల్యాణం, సాయంత్రం రథోత్సవం, రాత్రికి గజవాహనసేవ జరుగుతాయి. 24న ఉదయం వసంతోత్సవం, చక్రస్నానం, సాయంత్రం తెప్పోత్సవం, రాత్రికి ఆశ్వవాహనసేవ, ధ్వజావరోహణం, 25న ఉదయం కోన నుంచి గోనుపల్లికి ఉత్సవమూర్తుల తిరుగు ప్రయాణం, రాత్రికి గ్రామోత్సవం జరుగుతాయి.

పటిష్ట పోలీసు బందోబస్తు

కోన బ్రహ్మోత్సవాలకు లక్షలాదిమంది భక్తులు తరలివస్తారని అంచనా. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆత్మకూరు డీఎస్పీ కోటారెడ్డి పర్యవేక్షణలో రాపూరు, సంగం, ఆత్మకూరు సీఐలతోపాటు 10 మంది ఎస్‌ఐలు, మహిళా పోలీసులు, హోంగార్డులు, ప్రత్యేక పోలీసులు కలిపి మొత్తం 250 మంది వరకు బందోబస్తు నిర్వహిస్తారని రాపూరు ఎస్‌ఐ మాలాద్రి తెలిపారు.

భక్తుల కోసం 120 ఆర్టీసీ బస్సులు

కోన ఉత్సవాలకు నెల్లూరు, చిత్తూరు, కడప, తిరుపతి జిల్లాల నుంచి భారీ సంఖ్యలో ప్రజలు తరలిరానున్నారు. దీంతో ఆయా ప్రాంతాల నుంచి సుమారు 120 బస్సులు నడుపుతున్నట్లు రాపూరు ఆర్టీసీ డిపో మేనేజరు అనిల్ కుమార్ తెలిపారు. ఇంకా అవసరమైతే బస్సుల సంఖ్యను పెంచుతామన్నారు. ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని చర్యలు తీసుకున్నామన్నారు.



ఆలయం వద్ద వేసిన చలువ పందిళ్లు

కోనలో వసతుల మెరుగు



ఆలయ ఉపకమిషనర్ సాగర్‌బాబు

కోనలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశామని ఆలయ ఉపకమిషనర్ సాగర్‌బాబు తెలిపారు. సామాన్య భక్తులు స్వామివారిని సులభంగా, త్వరితగతిన దర్శించుకునేలా చర్యలు చేపట్టామన్నారు. ఇందుకోసం ఆలయం వద్ద ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశామని, ఎండకు భక్తులు ఇబ్బంది పడకుండా చలవ పందిళ్లు వేశామని ఆయన వివరించారు. భక్తులకు తాగునీటి వసతి కూడా కల్పించామని చెప్పారు.

● ఉత్సవాలకు ప్రచారమేది?

ప్రతిఏటా కోన బ్రహ్మోత్సవాలకు రాష్ట్రం నలు మూలల నుంచి భారీగా భక్తులు తరలివస్తారు. అయితే ఈ ఏడాది అందుకు తగ్గట్టుగా ప్రచారం చేయడంలో అధికారులు విఫలమయ్యారన్న విమర్శలు ఉన్నాయి. ఉత్సవాలకు పదిరోజుల ముందు నుంచే వాల్‌పోస్టర్లను వివిధ డిపోల బస్సులకు అంటిస్తారు. కానీ ఈసారి అలాంటి ఏర్పాట్లు చేయలేదు. ఉత్సవాలకు భారీగా ఆదాయం వస్తున్నా నామమాత్రంగా ప్రచారం కల్పించారనే విమర్శలు ఉన్నాయి.

● పట్టువస్త్రాలు ఎవరు సమర్పిస్తారు?

స్వామివారికి గరుడసేవ రోజున స్థానిక ఎమ్మెల్యే పట్టువస్త్రాలు సమర్పించడం ఆనవాయితీ. అయితే ఈసారి బ్రహ్మోత్సవాలు జరిగే సమయానికి ఎన్నికల ఫలితాల కోసం నేతలు ఎదురు చూస్తున్నారు. అంతేకాక కోడ్ అమలులో ఉంది. ఈ పరిస్థితుల కారణంగా ఈ ఆనవాయితీ కొనసాగుతుందా.. లేదా? అన్నది అంతుబట్టడం లేదు. ఇక శ్రీవారి కల్యాణం రోజున ముత్యాల తలంబ్రాలను గతంలో ఆలయ చైర్మన్ సమర్పించేవారు. కానీ ఈ సారి ఆలయ పాలక మండలి పదవీకాలం పూర్తి అయింది. కొత్త పాలకమండలి ఏర్పాటు కాలేదు. దీంతో స్వామి వారికి ముత్యాల తలంబ్రాలు అందచేసే సంప్రదాయం ఉంటుందా.. ఉండదా..? అని భక్తులు సందేహిస్తున్నారు.



హంసవాహనంపై గ్రామోత్సవంలో లక్ష్మీనరసింహుడు

వేదగిరీశుడికి హంసవాహన సేవ

నెల్లూరు(రూరల్). మే 18: వేదగిరి లక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారు హంస వాహనంపై గ్రామోత్సవంలో భక్తులకు దర్శనమిచ్చారు. ముందుగా స్వామివారిని అలంకరణ మండపానికి మంగళ వాయిద్యాలు, వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య తీసుకువచ్చిన అర్చకులు, ఆపై విశేష అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామి వారిని అలంకరించి హంసవాహనంపై ఆశీనులను చేసి పుర వీధుల్లో ఊరేగించారు. ఈ వేడుకలను వీక్షించేందుకు భక్తులు వేదగిరికి చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో గిరికృష్ణ, ప్రధాన అర్చకులు భాస్కరాచార్యులు, తదితరులు పాల్గొన్నారు.



మాలకొండలోని క్యూలైన్‌లో కిక్కిరిసిన భక్తులు

మాలకొండలో భక్తుల రద్దీ

- ఘాట్‌రోడ్డులో నిలిచిన ట్రాఫిక్

వలేటివారిపాలెం, మే 18 : మండలంలోని మాలకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. నరసింహస్వామిని దర్శించుకునేందుకు దూరప్రాంతాల నుంచి వేలాదిమంది తరలివచ్చారు. వేసవి కాలం కావడం, స్కూళ్లకు సెలవులు రావడంతో మాలకొండ భక్తులతో పోటెత్తింది. క్యూ లైన్లు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులు పక్కకు తొలగేందుకు కూడా అవకాశం లేనంతగా రద్దీ నెలకొంది. ప్రత్యేక దర్శనానికి సుమారు నాలుగు గంటలకుపైగానే సమయం పట్టింది. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ అధికారులు గర్భగుడిలో ప్రత్యేక పూజలను నిలిపివేశారు. క్యూలో ఉన్న భక్తులను అదుపు చేయడంలో ఆలయ సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఘాట్‌రోడ్డులో వచ్చే పోయే వాహనాలతో గంటల తరబడి ట్రాఫిక్ నిలిచిపోయింది. ట్రాఫిక్‌ను అదుపు చేయండంలో పోలీసులు నానా అగచాట్లు పడ్డారు.

పోలింగ్ ముగిసినా ఇదేంటి?

- యథావిధిగా చెక్‌పోస్టుల కొనసాగింపు
- వాహనాల తనిఖీలు ప్రారంభం
- ఎస్ఎస్‌టీ, ఎఫ్ఎస్‌టీలకు మళ్లీ విధులు
- ప్రజలకు తప్పని ఇబ్బందులు
- ప్రభుత్వ ఉద్యోగులకూ అవస్థలే..!

నెల్లూరు, మే 18 (ఆంధ్రజ్యోతి): పోలింగ్ ముగిసినా ఎన్నికల నిబంధనల నుంచి ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పటి వరకు ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ప్రజలంతా ప్రభుత్వ యంత్రాంగానికి సహకరించారు. ఎక్కడ చెక్‌పోస్ట్ వద్ద ఆపినా.. ఓపిగ్గా తమ వద్ద ఉన్న బ్యాగులు చూపించడం, కార్లు, ఇతర తనిఖీలకు సహకరించారు. అయితే పోలింగ్ ముగిసినా ఈ తనిఖీలు మాత్రం ఆగడం లేదు. ఈనెల 13న ఎన్నికల చెక్‌పోస్ట్ పాయింట్లను తొలగించారు. అయితే శనివారం నుంచి మళ్లీ వాటిని తెరిచారు. ఆ మార్గాల నుంచి వెళ్లే ప్రతి వాహనాన్ని ఆపి తనిఖీ చేయడం ప్రారంభించారు. ఎన్నికలు పూర్తయిన తరువాత ఎందుకిలా చేస్తున్నారు.. ఏమి ప్రయోజనం...? అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నా చెక్ పాయింట్ల వద్ద ఉన్నవారి నుంచి సమాధానం లేదు. అసలు చెక్ పాయింట్లు ఎందుకు ఏర్పాటు చేశారో.. తమకు కూడా తెలియదంటూ అధికారులు సమాధానం చెప్పడం గమనార్హం.

మళ్లీ ఏంటిది?

సాధారణంగా పోలింగ్ ముగిసే వరకు అధికారులు కఠిన ఆంక్షలను అమలు చేస్తుంటారు. పరిమితులకు మించి నగదు, ఇతర వస్తువులను తీసుకెళ్లేందుకు అనుమతివ్వరు. పారదర్శక ఎన్నికల నిర్వహణలో భాగంగా ఈ నిబంధనలను ఎన్నికల కమిషన్ అమలు చేస్తుంది. పోలింగ్ అయిపోగానే మళ్లీ ప్రజా జీవనం యథావిధిగా సాగుతుంది. ఇప్పటి వరకు ఒక్కో నియోజవకర్గంలో మూడుచోట్ల చెక్ పాయింట్ల(స్టాటికల్ సర్వేలెన్స్ టీమ్స్)లో ఎస్ఎస్‌టీలు విధులు నిర్వహించాయి. అలాగే మూడు షిఫ్టులలో ఒక ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్ పనిచేసింది. ఒక్కొక్క ఎస్ఎస్‌టీ, ఎఫ్ఎస్‌టీల్లో ఐదుగురు చొప్పున అధికారులు, పోలీసులు విధులు నిర్వహించారు. పోలింగ్ ముగియగానే వీరందరి విధులు ముగిసినట్లు ప్రకటించిన అధికారులు ఇప్పుడు మళ్లీ వారికి విధులకు కేటాయించడం విమర్శలకు తావిస్తోంది.



నెల్లూరు: ఇరుగాళమ్మ ఆలయం వద్ద రోడ్డు మధ్యలో ఉన్న బారికేడ్లు

ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీల ఏర్పాటు

ఇటీవల ఎన్నికల కమిషన్ ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీలను ఏర్పాటు చేస్తూ సర్క్యులర్ జారీ చేసింది. దాని ప్రకారం పోలింగ్ ముగిసిక రాష్ట్రాల్లో జిల్లాకు ఒక ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్‌ను నియమించమని చెప్పినట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. ఒకవేళ పక్క రాష్ట్రాల్లో పోలింగ్ జరగాల్సి ఉంటే బార్డర్ జిల్లాల్లో ఇతర రాష్ట్రాల చెక్‌పోస్టులను కొనసాగించాలని ఎన్నికల కమిషన్ సూచించినట్లు తెలిసింది. మిగిలిన ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీలతో పనిలేదని ఆ సర్క్యులర్‌లో పేర్కొనట్లు అధికారవర్గాలు పేర్కొన్నాయి. అయితే అందుకు భిన్నంగా ఇప్పుడు అన్ని నియోజక వర్గాల్లో పాత పద్ధతిలోనే టీమ్‌లన్నీ ఏర్పాటు చేయడం గమనార్హం. ఇదిలా ఉంటే ఒక్కొక్క టీమ్‌లో నలుగురు చొప్పున పోలీసులు పనిచేస్తున్నారు. పోలీస్‌స్టేషన్లలోని సిబ్బంది ఈ టీమ్‌ల్లో విధులే సరిపోతున్నారు. కౌంటింగ్ తరువాత సమస్యాత్మక ప్రాంతాల్లో గొడవ జరిగే అవకాశం ఉందని ఇప్పటికే నిఘా వర్గాలు హెచ్చరించి ఉన్నాయి. ఈ నేపథ్యంలో పోలీసు సిబ్బందిని ఉపయోగం లేని తనిఖీ కేంద్రాల్లో విధులు కాకుండా, సమస్యాత్మక ప్రాంతాలపై పర్యవేక్షణకు ఉపయోగించుకుంటే ప్రయోజనం ఉంటుందని రాజకీయ నిపుణులు సూచిస్తున్నారు. గడిచిన నెలరోజులుకు పైగా ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీలలో విధులు నిర్వహిస్తున్న అధికారులు, ఉద్యోగులు తమ సొంత కార్యాలయాలకు వెళ్లడం మానేశారు. తిరిగి మళ్లీ విధులు కేటాయించడంతో వారి సొంత శాఖల్లోని పనులను పూర్తి చేయడం సిబ్బందికి కష్టంగా మారింది.



చిల్డ్రన్స్ పార్కు సమీపంలోని జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

సైదాపురం వ్యవహారంపై కలెక్టర్ సీరియస్

- నివేదిక ఇవ్వాలని ఆదేశం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నెల్లూరు, మే 18 (ఆంధ్రజ్యోతి): సైదాపురం మండలం లో క్వార్ట్జ్ అక్రమ తవ్వకాలకు సంబంధించి మైనింగ్‌శాఖ పట్టుకున్న వాహనాలను ఆ శాఖకు తెలియకుండా విడుదల చేయడంపై జిల్లా కలెక్టర్ ఎం.హరినారాయణన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'మైనింగ్‌శాఖే తెల్లబోయింది' అన్న కథనానికి కలెక్టర్ స్పందించారు. ఈ విషయమై నివేదిక ఇవ్వాలని మైనింగ్, రెవెన్యూ అధికారులను ఆయన ఆదేశించినట్లు తెలిసింది. మైనింగ్ అధికారులు ఫిర్యాదు చేయనపుడు వారికి తెలియకుండా రెవెన్యూ అధికారులు ఎలా ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు ఎలా కేసు నమోదు చేశారన్న విషయాలను కలెక్టర్ ఆరాతీసినట్లు సమాచారం.

ఆంధ్రజ్యోతి విజిట్

అందని పౌష్టికాహారం

- తలుపులు తెరుచుకోని అంగన్‌వాడీ కేంద్రాలు
- మామూళ్లతో సరిపెట్టుకుంటున్న అధికారులు
- లోపాయికారీ ఒప్పందంతో సిబ్బంది
- మధ్యాహ్న భోజనం లేక పస్తులున్న చిన్నారులు

'ఇదిగో.. మీరేమీ వేసవి సెలవుల్లో అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలకు వండీవార్చేది లేదు.. కాకుంటే ఏదో నామమాత్రంగా సెంటర్లు తెరిచి ఉంచండి. ఇందుకు మీరు చేయాల్సింది. అంగన్‌వాడీ కార్యకర్తలు రూ.300, ఆయాలు రూ. 200 చెల్లిస్తే సరిపోతుంది'


\- అంగన్‌వాడీ కేంద్రాలకు ఆశాఖలోని కొంతమంది సూపర్‌వైజర్లు మౌఖికంగా జారీ చేసిన ఆదేశాలు

'ఇది మేము చెప్పేది కాదమ్మో... జిల్లా అధికారి నుంచి సీడీపీవోకు, వారి నుంచి మాకు ఇలాగే చెప్పారు. ఇదంతా మాకే అనుకోకండి. జిల్లా అధికారి నుంచి అందరికి ఇచ్చుకోవాలి'.

\- ఇవండీ..! అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చిన చీకటి ఆదేశాలు

\- నెల్లూరు (వీఆర్పీ)

ఇంకేముంది...!? అంతా మామూలుగా జరిగిపోయింది. ఈ వ్యవహారం శనివారం ఆంధ్రజ్యోతి నిర్వహించిన విజిట్‌లో బట్టబయలైంది. ఉదయగిరిలోని ఎస్సీ కాలనీలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో వేసిన తాళాలు వేసినట్టే ఉన్నాయి. ఇందులో 62 మంది చిన్నారులున్నారు. వీరికి మధ్యాహ్నభోజనం అందలేదు. దీంతో ఆ చిన్నారులు పస్తులుండి పోయారు. బుచ్చిలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల పరిస్థితి కూడా ఇంతే. వలేటివారిపాళెం అంగన్ వాడీ కేంద్రంలో కూడా తలుపులు తెరుచుకోలేదు. ఇలా చాలా ప్రాంతాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో మధ్యహ్న భోజనం పెట్టకుండానే సరిపెట్టేశారు. కేంద్రాలకు వచ్చిన చిన్నారులు భోజనం లేక నిరాశగా ఇంటిముఖం పట్టారు.



మూసి ఉన్న వలేటివారిపాలెంలోని అంగన్‌వాడీ కేంద్రం

మే ఒకటి నుంచి అంగన్‌వాడీ కేంద్రాలను ఒక్కపూట మాత్రమే నిర్వహిస్తున్నారు. ఇందుకుగాను అంగన్‌వాడీ టీచరు మొదటి 15రోజులు విధులు నిర్వహించాలి. రెండో విడత 15రోజులు ఆయా నిర్వహించాలి. ఈ సమయంలో యథావిధిగా చిన్నారులకు అందించాల్సిన పాలు, గుడ్లతోపాటుగా మెనూ ప్రకారం భోజనం వడ్డించాల్సి ఉంది. అలాంటివి ఏమీ లేకుండానే మే నెల సగం పూర్తయింది. అయినా అధికారులెవరూ అటువైపు కన్నెత్తి చూడనేలేదు. ముందుగానే అనుకున్న ప్రథకం ప్రకారం మేలో పౌష్టికాహారం బంద్ చేశారు. అయితే పెట్టినట్లుగా రికార్డులు సృష్టించారు.ఏప్రిల్ నుంచి ఎన్నికల కోడ్ అమలులో ఉండగా, ఎన్నికల విధులకు కొంతమంది సిబ్బందిని నియమించారు. అదే వీరికి కలిసొచ్చింది.

● లోపాయికారీ ఒప్పందం

ఐసీడీఎస్‌శాఖలోని కొంతమంది సిబ్బంది లోపాయికారీ ఒప్పందంతో పలు అంగన్‌వాడీ కేంద్రాలు తలుపులు కూడా తెరుచుకోలేదు. గర్భిణులు, బాలింతలకు టేక్ హోం రేషన్ అందించిన సిబ్బంది, పసిబిడ్డలకు అందించాల్సిన పౌష్టికాహారం అందకుండా బొక్కేశారు. జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాలు 2,705 ఉండగా, మినీ అంగన్‌వాడీ కేంద్రాలు 229 ఉన్నాయి. వీటి పరిధిలో గర్భిణులు 13,389 మంది, బాలింతలు 12,449 మంది, 6నెలలు నుంచి 3 ఏళ్ల లోపు చిన్నారులు 67,606 మంది, 3-6 సంవత్సరాలలోపు పిల్లలు 51,904 మంది ఉన్నారు. పేదపిల్లలకు సరైన పౌష్టికాహారం అందించాలనే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సౌజన్యంతో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలు... ఇలా కొంతమంది స్వార్థపరుల వల్ల లక్ష్యం నీరుగారిపోతున్నది. కాగా ఆ శాఖ ప్రాజెక్టు అధికారిని సంప్రదించేందుకు ప్రయత్నించగా సెలవులో ఉన్నారని సిబ్బంది తెలియజేశారు.

ఇంటికి తాళం వేసుంటే దోచేస్తాడు!

- పలుమార్లు జైలుకెళ్లి వచ్చినా మార్పు లేదు...
- బాలాజీనగర్ పోలీసులకు పట్టుబడ్డ నిందితుడు
- 44.5 సవర్ల బంగారు ఆభరణాల స్వాధీనం



నిందితుడి వివరాలు తెలుపుతున్న నగర డీఎస్పీ

నెల్లూరు(క్రైం), మే 18: తాళాలు వేసి ఉన్న ఇళ్లపై అతను కన్ను పడిందో ఆ రోజు రాత్రి ఆ ఇంట్లో చోరీ జరిగినట్లే. ఇళ్లకు తాళాలు పగులగొట్టి దొరికిన వరకు దోచేస్తాడు. పలు ఇళ్లకు కన్నాలు వేసి పోలీసులకు పట్టుబడి జైలు శిక్ష అనుభవించి తిరిగి వచ్చినా అతనిలో మార్పు రాలేదు. షీటు ఓపెన్ చేసినా దొంగతనాలు మాత్రం మానడం లేదు. ఈ క్రమంలో ఓ ఇంట్లో చోరీ చేసి పోలీసులకు పట్టుబడ్డాడు. అతని నుంచి 44.5 సవర్ల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు శనివారం బాలాజీనగర్ పోలీసు స్టేషన్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో నగర డీఎస్పీ డీ శ్రీనివాసరెడ్డి నిందితుడి వివరాలు తెలిపారు. నగరంలోని అరవిందనగర్ ఎక్స్‌టెన్షన్ ఏరియాలో మహాలక్ష్మమ్మగుడి సమీపంలో వేములపాటి మధుసూదనరావు, శ్రీవల్లి దంపతులు నివాసం ఉంటున్నారు. శ్రీవల్లి తన కుటుంబంతో కలిసి ఈ నెల 15వ తేదీన అల్లూరులోని అత్తారింటికి వెళ్లారు. ఈ క్రమంలో ఇంటి తాళాలు, బీరువా తాళాలు పగులగొట్టి అందులోని బంగారు ఆభరణాలను దోచుకెళ్లారు. తిరిగి 16వ తేది ఇంటికి వచ్చిన బాధితురాలు తలుపులు తెరిచి ఉండటాన్ని గుర్తించి లోపలికి వెళ్లి చూడగా బీరువాలోని నగలు కనిపించలేదు. దీంతో చోరీ జరిగిందని గ్రహించి బాలాజీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ ఎల్ వీరానాయక్ కేసు నమోదు చేసి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి సాంకేతిక పరిజ్ఞానంతో దర్యాప్తు చేపట్టారు. నిందితుడిని శనివారం అరెస్ట్ చేశారు. అతని నుంచి రూ.14.24 లక్షల విలువ చేసే 44.5 సవర్ల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు.

● నగరంలోని జనార్దన్‌రెడ్డి కాలనీకి చెందిన మిదూరి సునీల్ చెడు వ్యసనాలకు బానిసై కష్టపడకుండా నగదు సంపాదించాలని దొంగతనాలకు అలవాటు పడ్డాడు. 2013 నుంచి జిల్లాలోని పలు పోలీసు స్టేషన్‌ల పరిధిలో తాళాలు వేసి ఉన్న ఇళ్లనే టార్గెట్ చేస్తూ రాత్రిపూట తాళాలు పగులగొట్టి దొరికిన వరకు దోచేసేవాడు. పలు కేసులలో జైలుకు వెళ్లి వచ్చినా అతనిలో మార్పు రాలేదు. దీంతో పోలీసులు నవాబుపేట పోలీసు స్టేషన్‌లో డీసీ షీట్‌ను తెరిచారు. అయినా సునీల్ వరుస దొంగతనాలకు పాల్పడుతూనే ఉన్నాడు. ఈ నేపథ్యంలోనే బాలాజీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో దొంగతనం చేసి పోలీసులకు పట్టుపడ్డాడు. చోరీ జరిగిన 48 గంటల వ్యవధిలో నిందితుడును అరెస్ట్ చేసి, సొత్తును స్వాధీనం చేసుకున్న బాలాజీనగర్ ఇన్‌స్పెక్టర్ ఎల్ వీరానాయక్, ఏఎస్ఐ పీ శ్రీనివాసరాజు, హెడ్‌కానిస్టేబుళ్లు కెవి సుధాకర్, సీహెచ్ శివకుమార్, సీహెచ్ రమేష్, పి వెంకటేశ్వర్లు తదితరులను ఎస్పీ అభినందించారని డిఎస్పీ తెలిపారు. ప్రజలు ఇళ్లు విడిచి దూరప్రాంతాలకు వెళుతున్నప్పుడు జిల్లా పోలీసులు ఉచితంగా అందిస్తున్న ఎల్‌హెచ్‌ఎమ్ఎస్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రమాదవశాత్తు కాలువలో పడి వ్యక్తి మృతి



పెంచలయ్య మృతదేహం

సంగం, మే 18: స్థానిక కనిగిరి రిజర్వాయర్ కాలువ క్రాస్ రెగ్యులేటర్ల వద్ద ప్రమాదవశాత్తు కాలు జారి నీటిలో పడి పెంచలయ్య (40) అనే వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. వివరాల మేరకు మండలంలోని వంగల్లు గ్రామానికి చెందిన పెంచలయ్య అనే రైతు కొంతకాలం నుంచి సంగం అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నాడు. ఈ క్రమంలో బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు కాలు జారి కాలువలో పడి మృతి చెందాడు. స్థానికులు గుర్తించి పోలీసులకు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని బయటకు తీసి పరిశీలించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆత్మకూరు వైద్యశాలకు తరలించారు. మృతుడికి భార్య, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. ఆ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలుపట్టాలపై గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

బిట్రగుంట, మే 18: బిట్రగుంట రైల్వే సెక్షన్ పరిధిలోని శ్రీవేంకటేశ్వరపాలెం - బిట్రగుంట స్టేషన్ల మధ్య 209/23-25 కిలోమీటర్ల మధ్య సుమారు 40 సంవత్సరాల గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం గుర్తించినట్లు కావలి రైల్వే పోలీసులు శనివారం తెలిపారు. రైల్లో నుంచి ప్రమాదవశాత్తు పడి మృతిచెంది ఉండవచ్చు న్నారు. మృతదేహాన్ని కావలి ఏరియా వైద్యశాలకు తరలించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని హెడ్‌కానిస్టేబుల్ వై శ్యాంకుమార్ తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

వెంకటాచలం, మే 18 : రోడ్డు దాటుతున్న వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన మండలంలోని కాకుటూరు వద్ద జాతీయ రహదారిపై శనివారం చోటుచేసుకుంది. వివరాల మేరకు కోవూరుకు చెందిన ఆంథోని (55) ఆరు సంవత్సరాల నుంచి కాకుటూరుకు వచ్చి కూలీ పనులకు వెళ్లి జీవనం సాగిస్తున్నాడు. శనివారం ఉదయం చెరువు వద్దకు వెళ్లి స్నానం చేసి రోడ్డు దాటుతుండగా గూడూరు వైపు నుంచి నెల్లూరు వైపు వేగంగా వెళ్తున్న వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు సమాచారం ఇవ్వడంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ దుర్మరణం

- మనుబోలు వద్ద లారీని ఢీకొన్న ప్రైవేట్ బస్సు
- ఆయిల్ పోస్తుండగా ప్రమాదం



సాంబశివరావు మృతదేహం

మనుబోలు, మే 18: మండల పరిధిలోని జాతీయరహదారిపై వీరంపల్లి క్రాస్ రోడ్డు వద్ద శనివారం వేకువ జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో కొల్లిపర సాంబశివరావు (40) అనే లారీ డ్రైవర్ మృతి చెందాడు. వివరాల మేరకు గుంటూరు జిల్లా దామరపల్లికి చెందిన కొల్లిపర సాంబశివరావు శుక్రవారం రాత్రి 7గంటల సమయంలో గుంటూరు నుంచి రైలు చక్రాలు తీసుకుని రేణిగుంట వెళ్లేందుకు లారీలో బయలుదేరాడు. శనివారం వేకువ జామున వీరంపల్లి క్రాస్ రోడ్డు వద్ద లారీకి డీఈఎఫ్ ఆయిల్ పోసేందుకు రోడ్డు మార్జిన్ పక్కన నిలిపి ఆయిల్ పోస్తున్నాడు. ఇంతలోనే బెంగళూరు వెళ్తున్న ఓ ప్రైవేట్ ట్రావెల్ బస్సు ముందు వెళ్తున్న వాహనాన్ని అధిగమించబోయి రోడ్డు మార్జిన్‌లో ఆగిఉన్న లారీని వేగంగా ఢీకొంది. దీంతో లారీ సాంబశివరావును 20అడుగుల మేర ఈడ్చుకుని వెళ్లింది. దీంతో ఆయన అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఈ ప్రమాదంలో బస్సులో ఉన్న ప్రయాణికులకు ఎలాంటి గాయాలు కాలేదు. ప్రమాదం జరిగినా బస్సు ఆగకుండా వెళ్లిపోయింది. సమాచారం అందుకున్న ఎస్ఐ అజయ్‌కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు నమోదు చేసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. హైవేపై ఉన్న సీసీ కెమెరాల ద్వారా ప్రమాదానికి కారణమైన బస్సును గుర్తించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

యువకులను కాపాడిన మెరైన్ పోలీసులు



యువకుల ప్రాణాలు కాపాడిన మెరైన్ పోలీసులు

తోటపల్లిగూడూరు, మే 18 : మండలంలోని కోడూరు బీచ్‌లో శనివారం సరదాగా గడిపేందుకు సముద్ర స్నానానికి దిగి ప్రమాద స్థితిలో ఉన్న ఇద్దరు యువకులను ప్రాణాపాయం నుంచి దుగరాజపట్నం సీఎస్‌పీఎస్ సిబ్బంది కాపాడారు. వివరాల మేరకు నెల్లూరు డైకస్ రోడ్డు నుంచి ఐదుగురు విద్యార్థులు టి.జానీ, సంజీవి, శివరాం, దినేశ్వర్, నందు, కోడూరు బీచ్‌కు సముద్ర స్నానానికి వచ్చారు. వీరిలో టి.జానీ సముద్రంలో ఈత కొడుతూ అలల తాకిడికి కొంతదూరం లోతుగా వెళ్లిపోయాడు. అతనిని కాపాడేందుకు వెళ్లిన మరో యువకుడు ఇరుక్కుపోవడంతో గమనించిన మెరైన్ సిబ్బంది ఆవుల సంజీవి, కేవీ శేషగిరిరావు వెంటనే లైఫ్‌బాయ్‌తో వెంబడించి యువకులను సముద్రం ఒడ్డుకి చేర్చారు. వారికి ప్రథమ చికిత్స జరిపి అనంతరం వైద్యశాలకు తీసుకెళ్లడంతో వారు సురక్షితంగా బయటపడ్డారు. ఈ సందర్భంగా పలువురు పర్యాటకులు మెరైన్ సిబ్బందిని అభినందించారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	172
లేయర్ లైవ్	110
స్కిన్ చికెన్	300
స్కిన్‌లెస్	330
లేయర్	187

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 7052
వెండి కిలో ధర	రూ. 93,200
వెండి ఒక గ్రాము	రూ. 95.20

పచ్చిరొట్టతో నాణ్యమైన దిగుబడులు

- వరిపైరుకు సేంద్రీయ పదార్థాలు అందించడంలో ఈ పైర్లు కీలకం
- జిల్లాకు 8,728 క్వింటాళ్ల కేటాయింపు
- జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి



నెల్లూరు(వ్యవసాయం), మే 18: వరిసాగులో నాణ్యమైన, అధిక దిగుబడులు సాధించేందుకు పచ్చిరొట్ట పైర్లు ఎంతో ఉపయోగపడతాయి. వరి సాగుకు ముందు పచ్చిరొట్టపైర్లతో పొలంలో దమ్ము చేస్తే పైరుకు అవసరమైన సేంద్రీయ పదార్థాలు అందుతాయి. పచ్చిరొట్ట పైర్లు అయిన జీలుగ, జనుము, పిల్లిపెసర, అలసంద, పెసర, వెంపలి వంటి వాటిని పెంచి పూతదశకు ముందుగా పొలంలో దమ్ము చేయాలి. ఆ తర్వాత వరినాట్లు వేసుకొన్నట్లయితే లాభాలు పొందవచ్చని జిల్లా వ్యవసాయాధికారి(డీఏవో) పీ.సత్యవాణి తెలిపారు. ఖరీఫ్ సీజన్ సందర్భంగా పచ్చిరొట్ట పైర్ల ప్రాముఖ్యతను ఆమె రైతులకు తెలియజేశారు.

● 8728 క్వింటాళ్ల కేటాయింపు

భూసారాన్ని పెంచే పచ్చిరొట్టపైర్ల విత్తనాలు జిల్లాకు 8,728 క్వింటాళ్లు కేటాయించారు. వీటిలో 4,501 క్వింటాళ్ల జీలుగ, 2,135 క్వింటాళ్ల జనుము, 2,092 క్వింటాళ్ల పిల్లిపెసర ఉన్నాయి. 50శాతం సబ్సిడీతో వ్యవసాయశాఖ ఆర్‌బీకేల ద్వారా పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్నాయి. జీలుగ కిలో రూ.44లు, జనుము కిలో రూ.44లు, పిల్లిపెసర కిలో రూ.67లకు అందిస్తున్నట్లు ఆమె వివరించారు. ఎకరాకు 10కిలోల జీలుగ, 10కిలోల జనుము, 8కిలోల పిల్లిపెసర ఇవ్వనున్నామని, ఒక్కో రైతుకు గరిష్ఠంగా 5ఎకరాల వరకు ఇస్తామని తెలిపారు.



పీ సత్యవాణి

● పైరుకు సంవృద్ధిగా సేంద్రీయ పదార్థాలు

వరిసాగుకు ముందు పచ్చిరొట్ట పైర్లతో దమ్ము చేయడం వల్ల భూమి భౌతికస్థితిని మెరుగుపడుతుంది. భూమిలో పైర్లకు కావాల్సిన సేంద్రీయ పదార్థాలను అందిస్తుంది. భూమిలో నీటిని నిల్వచేసే గుణాన్ని పెంచుతుంది. భూమిలో నత్రజని మోతాదును పెంచేందుకు ఈ లెగ్యుమినస్‌జాతి పచ్చిరొట్ట పైరులు ఉపయోగపడతాయి. ఎకరానికి 20-50 కిలోల నత్రజనిని అందిస్తాయి. పంటల్లో వ్యాధి నిరోధకశక్తిని పెంచుతాయి. సమస్యాత్మక భూముల(చౌడు) సాగుకు అనుకూలంగా మారుతాయి. పర్యావరణ కాలుష్యం లేకుండా దీర్ఘకాలిక ప్రయోజనాలను అందిస్తాయి. పంట ఉత్పత్తుల నాణ్యతను, రుచిని పెంచుతాయి.

● జీలుగ

ఎకరానికి 12కేజీల జీలుగ విత్తనం వాడితే 4.5 టన్నుల పచ్చిరొట్ట ఎరువుతోపాటు, 6.2 కేజీల నత్రజని, 1.5 కేజీల భాస్వరం, 5.1 కేజీల పొటాష్‌ను భూమికి అందిస్తాయి.

● జనుము

ఎకరానికి 16కేజీల జనుము విత్తనం వాడితే 4.6 టన్నుల పచ్చిరొట్ట ఎరువుతోపాటు 7.5 కేజీల నత్రజని, 1.2 కేజీ భాస్వరం, 5.1 కేజీ పొటాష్‌ను భూమికి అందిస్తాయి.

● పిల్లిపెసర

ఎకరానికి 8 కేజీల పిల్లిపెసర విత్తనం వాడితే 2.5 టన్నుల పచ్చిరొట్ట ఎరువుతోపాటు 7.2 కేజీ నత్రజని, కేజీ భాస్వరం, 5.3 కేజీల పొటాష్ భూమికి అందుతుంది. కావున రైతులు ఈ పచ్చిరొట్ట పైర్లను పెంచి, దమ్ము చేసి వరిలో నాణ్యమైన, అధిక దిగుబడులు సాధించాలని ఆమె తెలిపారు.

మహిళలపై దాడులకు పాల్పడితే సహించం..!

- మహిళా కమిషన్ చైర్‌పర్సన్ గజ్జల వెంకటలక్ష్మి



ఆసుపత్రిలో బాధితురాళ్లను పరామర్శిస్తున్న మహిళ కమిషన్ చైర్‌పర్సన్ గజ్జల వెంకటలక్ష్మి

నెల్లూరు(వీఆర్సీ), మే 18 : మహిళలపై దాడులకు పాల్పడితే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని మహిళ కమిషన్ చైర్‌పర్సన్ గజ్జల వెంకటలక్ష్మి పేర్కొన్నారు. వింజమూరులో తల్లీకూతుళ్లపై కత్తితో విచక్షణా రహితంగా దాడి చేసిన ఘటనలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను శనివారం ఆమె పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ కొంతకాలంగా యువతిని ప్రేమిస్తున్నాని వెంటపడిన నాగరాజు శుక్రవారం దాడి చేశాడని, బాధితులకు ప్రభుత్వ సాయంతో చికిత్స అందిస్తున్నామన్నారు. పరారీలో ఉన్న నిందితుడిని త్వరగా పట్టుకొని శిక్షపడేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీకి సూచించామన్నారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన తర్వాత మహిళలపై దాడులు అధికమయ్యాయన్నారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. అనంతరం ప్రభుత్వ హోంకు తరలించాలని అధికారులకు సూచించారు. ఇలాంటి దాడులపై మహిళా కమిషన్ చర్యలు తీసుకోకుండా ఈసీ ఆంక్షలు విధించడం సరికాదన్నారు. అనంతరం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని వన్‌స్టాప్ సెంటర్‌ను తనిఖీ చేసి, రికార్డులు పరిశీలించారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

- పరీక్ష రాసి ఇంటికి వెళుతుండగా ప్రమాదం

నెల్లూరు(క్రైం), మే 18: రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలై చికిత్స పొందుతున్న యువకుడు శనివారం మృతి చెందాడు. నార్త్ ట్రాఫిక్ పోలీసుల సమాచారం మేరకు.. ముత్తుకూరుకు చెందిన పీ.రాజేష్, చెముడుగుంటకు చెందిన సురేష్‌లు నగరంలోని రావూస్ కళాశాలలో డిగ్రీ చదువుతున్నారు. ఈ నెల 17వ తేది ఇద్దరూ పరీక్ష రాశారు. రాజేష్ తన స్నేహితుడు సురేష్‌ను బైక్‌పై ఇంటివద్ద వదిలి పెట్టేందుకు జాతీయ రహదారి మీదుగా చెముడుగుంటకు బయలుదేరాడు. రాజేష్ బైక్ నడుపుతుండగా సురేష్ వెనుక కూర్చొన్నాడు. సర్వేపల్లి కాలువ వద్దకు వచ్చేసరికి ముందువెళుతున్న బైక్‌ను వేగంగా ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో రాజేష్‌కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల సహకారంతో స్నేహితుడు మెడికవర్ వైద్యశాలకు తరలించి అతని కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. వారు వైద్యశాలకు చేరుకొని అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం నారాయణకు, అక్కడ నుంచి జీజీహెచ్‌కు తరలించారు. జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడి తండ్రి మల్లికార్జున ఫిర్యాదు మేరకు నార్త్ ట్రాఫిక్ ఎస్ఐ గీతారమ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నగదు దోచుకెళ్లిన నిందితుల అరెస్ట్

నెల్లూరు(క్రైం), మే 18: సెకండ్ షో సినిమాకు వెళ్లి బైక్‌పై ఇంటికి వెళుతున్న వ్యక్తిని కత్తితో బెదిరించి నగదు, సెల్‌ఫోన్ దోచుకెళ్లిన నిందితులను చిన్నబజారు పోలీసులు 24 గంటల వ్యవధిలో అరెస్ట్ చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. పొదలకూరు రోడ్డు జీవీఆర్ కాలనీకి చెందిన ఎ కార్తీక్ ఏసీ కూరగాయల మార్కెట్ వద్ద తోపుడు బండిపై పండ్లు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 16వ తేది రాత్రి ఆయన ఎస్2 థియేటర్‌లో సెకండ్‌షో సినిమాకు వెళ్లాడు. సినిమా వదిలిన తర్వాత అర్ధరాత్రి బైక్‌పై ఇంటికి వెళుతుండగా బాబా సమోసా దుకాణం సమీపంలోకి వచ్చేసరికి ఆటో, స్కూటీపై నలుగురు వ్యక్తులు అతనిని అడ్డుకున్నారు. కత్తితో చంపుతామని బెదిరించి కార్తీక్ వద్ద ఉన్న రూ.5వేల, సెల్‌ఫోనును దోచుకెళ్లారు. ఆటో నెంబరు, స్కూటీ నెంబరును గుర్తుపెట్టుకున్న బాధితుడు జరిగిన విషయాన్ని చిన్నబజారు పోలీసులకు తెలియజేసి ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ బీ.అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు ఎస్ఐ సయ్యద్ లతీఫున్నీసా కేసు నమోదు చేశారు. ఆటో, బైక్ నెంబర్లు, సీసీపుటేజ్‌ల ఆధారంగా నిందితులు కొండాయపాలెం నక్కలగుంటకు చెందిన అరుల్ రాజ్, గోవర్ధన్, ఫణీంద్ర, రోక్సన్‌గా గుర్తించారు. నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఆర్టీసీ బస్టాండు సమీపంలో శనివారం నిందితులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి దోపిడీ సొమ్మును స్వాధీనం చేసుకున్నారు. నిందితులు మత్తు, మాదకద్రవ్యాలకు బానిసై దోపిడీలకు పాల్పడుతున్నట్లు పోలీసులు తెలిపారు.

వ్యక్తిపై దాడి

నెల్లూరు(క్రైం), మే 18: ఆర్థిక లావాదేవీల విషయంలో ఓ వ్యక్తిపై కొందరు దాడి చేసిన ఘటనపై చిన్నబజార్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. మూలాపేట కొండదిబ్బకు చెందిన గోవర్ధన్‌కు మూలాపేటకు చెందిన సునీల్‌కు మధ్య ఆర్థిక విభేదాలున్నాయి. ఈ నేపథ్యంలో ఈ నెల 17వ తేది రాత్రి మూలాపేటలోని వాగ్దా స్కూల్ వద్ద ఉండగా సునీల్ మరికొందరు కలిసి తనపై దాడి చేశారని గోవర్ధన్ చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పల్లెల్లో ప్రశాంత వాతావరణం నెలకొల్పాలి : ఎస్పీ

- తుమ్మలపెంటలో మత్స్యకారులతో సమావేశం

కావలి రూరల్, మే 18: ఎన్నికల కౌంటింగ్ సమయంలో గ్రామాల్లో ప్రతి ఒక్కరూ ప్రశాంత వాతావరణం నెలకొల్పాలని జిల్లా ఎస్పీ ఆరీఫ్ హఫీజ్ పేర్కొన్నారు. కావలి మండలం తుమ్మలపెంటలో శనివారం పర్యటించిన ఆయన కాపులు, మత్స్యకార నాయకులతో సమావేశమయ్యారు. తుమ్మలపెంటలో మే 13వ తేదీన పోలింగ్ జరుగుతున్న సమయంలో జరిగిన గొడవను దృష్టిలో పెట్టుకుని గ్రామంలో పర్యటించటం జరిగిందన్నారు. ఎన్నికల అనంతరం గ్రామాల్లో ఎలాంటి సంఘటనలకు తావులేకుండా ప్రతిఒక్కరూ సంయమనంతో ఉండాలన్నారు. కక్షలు, కార్పణ్యాలకు చోటులేకుండా గ్రామ అభివృద్ధికి పరస్పరం సహకరించుకోవాలని ఇరుపార్టీల నేతలకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ సిఐ రామక్రిష్ణారెడ్డి, రూరల్ సిఐ కాటూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వైద్య ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



సమావేశమైన మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా నాయకులు

కోవూరు, మే 18: వైద్య ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా కమిటీ అధ్యక్షుడు చేజర్ల సుధాకరరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక రైల్వే ఫీడర్సు రోడ్డులోని కల్యాణ మండపంలో శనివారం జరిగిన కోవూరు తాలూకా సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమస్యల సాధనకు ఉద్యోగులందరూ ఒక్కతాటిపై నిలవాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బి కమల్‌కిరణ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్ నాయకులు మజరుల్లా, జలీల్ అహ్మద్, పరిమళ, నాగరాజు మాట్లాడారు. కోవూరు తాలూకా కమిటీ అధ్యక్షునిగా బెనర్జీ, కార్యదర్శిగా ఆసియా బేగం, కోశాధికారిగా పఠాన్ అబ్దుల్ సుకూర్, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా డీ వేణు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా రాఘవేంద్ర, మహిళా సెక్రటరీగా రమణమ్మ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు.

పుస్తకాల బ్యాంకు ప్రారంభం

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), మే 18: మండలంలోని లక్ష్మీపురంలో శనివారం పుస్తక పఠనంపై ఆసక్తి పెంపొందించేందుకు యువత ఆధ్వర్యంలో పుస్తకాల బ్యాంక్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ పిల్లలు వారి సాధారణ విద్యా పాఠ్యాంశాలతో పాటు నిపుణులు రాయబడిన పుస్తకాలు చదవడానికి, వారిలోని పఠనాశక్తిని పెంపొందించుకునేందుకు ఈ పుస్తక బ్యాంకు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పుస్తక పఠనంతో మానసిక ఆనందాన్ని పొందవచ్చన్నారు. ప్రతిరోజు ఉదయం 7గంటల నుంచి 9 వరకు ఈ పుస్తక బ్యాంక్ అందుబాటులో ఉంటుందన్నారు. కార్యక్రమంలో సిద్ధార్థ పాఠశాల కరస్పాండెంట్ ఉదయశంకర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి ఏ.నరసింహులు, ఉపాధ్యాయుడు రమణారెడ్డి, గ్రామపెద్దలు పాల్గొన్నారు.



పుస్తకాలను ప్రదర్శిస్తున్న గ్రామపెద్దలు,యువకులు

బీఎల్వోలకు న్యాయం జరిగేలా చూస్తా !

- ఆర్వో రాజా రమేష్ ప్రేమ్‌కుమార్

వరికుంటపాడు, మే 18: ఎన్నికల విధులు చేపట్టిన బీఎల్వోలకు న్యాయం జరిగేలా తనవంతు బాధ్యతగా కృషి చేస్తానని ఆర్వో రాజారమేష్ ప్రేమ్‌కుమార్ అన్నారు. శనివారం నగదు చెల్లింపులకు సంబంధించి పలు పత్రికల్లో ప్రచురితమైన కథనాలకు స్పందించిన ఆయన స్థానిక తహసీల్దారు కార్యాలయంలో విచారణ చేపట్టారు. ఎంపీడీవో వెంకటకృష్ణకుమారితో సహా బీఎల్వోలను ఆరా తీశారు. అనంతరం వారి నుంచి లిఖితపూర్వకంగా నివేదికలు సేకరించారు. వాటిని పరిశీలించి బీఎల్వోలతో పాటు ఇతర సిబ్బందికి సైతం ఎన్నికల కమిషన్ నుంచి విడుదలైన నగదు అందేలా చూస్తానని తెలిపారు. ఆయన వెంట రీసర్వే డీటీ నరసారెడ్డి, తదితరులు ఉన్నారు.



నివేదికలు సేకరిస్తున్న ఆర్వో రాజారమేష్ ప్రేమ్‌కుమార్

వరి విత్తనాలు, ఎరువులు సిద్ధం

- ఏడీఏల సమీక్షలో జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి

నెల్లూరు(వ్యవసాయం), మే 18 : ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి బోర్ల కింద వరి సాగు చేపట్టే రైతులకు అవసరమైన నాణ్యమైన మేలురకం వరి విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉంచినట్లు జిల్లా వ్యవసాయాధికారి(డీఏవో) పీ.సత్యవాణి చెప్పారు. జిల్లా వ్యవసాయాధికారి కార్యాలయంలో శనివారం ఆమె జిల్లాలోని ఏడీఏలతో నిర్వహించిన సమావేశంలో ప్రస్తుతం సాగులో పంటలు, రానున్న సీజన్‌కు సంబంధించి రైతులను సన్నద్ధం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో 4316 క్వింటాళ్ల వరి విత్తనాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. కెఎన్ఎం-1638 రకం 4050 క్వింటాళ్లు, ఎన్ఎల్ఆర్-34449 రకం 216 క్వింటాళ్లు, బిపిటి-5402 రకం 50 క్వింటాళ్లు ఉన్నాయని చెప్పారు. కిలోకి రూ.5 చొప్పున సబ్సిడీ ఇస్తున్నామన్నారు. వీటితోపాటు ప్రత్యామ్నాయ పంటలైన మినుము, పెసర, కందులు కూడా 50శాతం సబ్సిడీతో అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. జిల్లాలోని రైతు భరోసా కేంద్రాలతోపాటు ప్రైవేటు డీలర్ల వద్ద ఎరువులు అందుబాటులో ఉన్నాయని, రైతు భరోసా కేంద్రాల్లో దాదాపు 854 టన్నుల యూరియా, డీఏపీ, కాంప్లెక్సు ఎరువులు, ప్రైవేటు డీలర్ల వద్ద 46,158 టన్నుల మేరకు వివిధ రకాల ఎరువులు ఉన్నాయని తెలిపారు. పచ్చిరొట్ట విత్తనాలు కూడా 8,728 క్వింటాళ్లు సిద్ధంగా ఉన్నాయని, 50శాతం సబ్సిడీతో రైతులకు అందించనున్నట్లు వెల్లడించారు. 10కిలోల జీలుగ బస్తా సబ్సిడీ పోను రూ.440, జనుము రూ.440, 8కిలోల పిల్లి పెసర రూ.536 రైతులకు అందుతాయ చెప్పారు. భూసారాన్ని పెంపొందించే సేంద్రియ ఎరువుల వాడకాన్ని రైతులు తగ్గించి రసాయనిక ఎరువుల మీద ఆధారపడుతున్నారని, దీనివల్ల భూమిలో సమతుల్యత దెబ్బతిని భూమి ఆరోగ్యం క్షీణిస్తోందని చెప్పారు. దీనిపై 20వ తేదీ నుంచి క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో ఏడీఏలు నర్సోజి, శేషగిరిలతో పాటు జిల్లాలోని ఏడీఏలు డీఏవో కార్యాలయ ఏవోలు పాల్గొన్నారు.

ఇంటర్‌లో మిగుల సీట్ల భర్తీకి 21న కౌన్సెలింగ్

నెల్లూరు (వీఆర్సీ) మే 18 : జిల్లాలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల జూనియర్ కళాశాలల్లో మిగిలి ఉన్న సీట్ల భర్తీకి ఈనెల 21న సంగం గురుకుల జూనియర్ కళాశాలలో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు జిల్లా కన్వీనర్ టీ హేమలత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ముత్తుకూరు, కండలేరు, బుచ్చిరెడ్డిపాళెం, కొత్తకోడూరు, సంగం, పెద్దపవని, వుదూరు, సూళ్లూరుపేట, డక్కిలిలో గురుకుల జూనియర్ కళాశాలల్లో 200సీట్లు మిగిలి ఉన్నాయని, కౌన్సెలింగ్‌కు 1:3 నిష్పత్తిలో ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఎస్సీ కేటగిరిలో ర్యాంకు 1 నుంచి 10,953 వరకు, ఎస్టీ కేటగిరిలో ర్యాంకు 297 నుంచి 21,587 వరకు, బీసీ కేటగిరిలో ర్యాంకు 16 నుంచి 2088 వరకు కౌన్సెలింగ్‌కు పిలుస్తామన్నారు. అలాగే హెచ్‌సీ (హరిజన క్రిస్టియన్)లో ర్యాంకు 1399 నుంచి 8735 వరకు, ఓసీ కేటగిరిలో ర్యాంకు 43 నుంచి 2635 వరకు ర్యాంకులు పొందిన బాలికలు సంగం గురుకుల కళాశాలలో మంగళవారం ఉదయం 10 గంటలకు హాజరుకావాలన్నారు. విద్యార్థులు ర్యాంకు కార్డు, 10వ తరగతి మార్కుల జాబితా, టీసీ, స్టడీ సర్టిఫికెట్, ఆధార్, కుల, ఆదాయ ధ్రువీకరణ నివాస పత్రలాను వెంట తీసుకురావాలని తెలిపారు. అలాగే తమ తల్లిదండ్రులను కూడా కౌన్సెలింగ్‌కి తీసుకురావాలన్నారు. పూర్తి వివరాలకు సమీపంలోని అంబేడ్కర్ గురుకులాలు, లేదా డీసీవో కార్యాలయంలో సంప్రదించాలన్నారు. లేనిపక్షంలో 82473 58603, 94940 90137,72072 81934 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

పేద మాదిగ విద్యార్థులకు ప్రోత్సాహకాలు

నెల్లూరు(వీఆర్సీ), మే 18 : ఈ ఏడాది 10వ తరగతిలో 500కుపైగా మార్కులు సాధించిన పేద మాదిగ విద్యార్థులకు జనరల్ నాలెడ్జ్ పరీక్ష నిర్వహించి అందులో ప్రతిభ చూపిన వారికి నగదు ప్రోత్సాహక బహుమతులు అందించనున్నట్లు మాదిగ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి తాళ్లపాక మస్తానయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన విద్యార్థులు ఈనెల 26న నెల్లూరు నగరంలోని పొదలకూరు రోడ్డులో ఉన్న పద్మావతి స్కూల్‌కు ఉదయం 10 గంటలకు తల్లిదండ్రులతో హాజరు కావాలని పేర్కొన్నారు. హాజరైన విద్యార్థులకు ఒక గంట సమయంలో జనరల్ నాలెడ్జ్ పరీక్ష నిర్వహిస్తారని తెలిపారు. ఈ పరీక్షలో ప్రతిభ చూపిన వారికి మొదటి బహుమతి రూ.25వేలు, రెండవ బహుమతి రూ.15వేలు, మూడవ బహుమతి రూ.10వేలు అందిస్తామని తెలిపారు. వివరాలకు 99590 90621, 63010 70312ను సంప్రదించాలన్నారు.

వైభవంగా దత్తాత్రేయుడి కలశ మహోత్సవం

లింగసముద్రం, మే 18: మండలంలోని మొగిలిచెర్ల గ్రామంలో దత్త దీక్ష మాలధారణ స్వాముల కలశ మహోత్సవం వైభవంగా జరిగింది. దత్తాత్రేయస్వామి ఆరాధన మహోత్సవం సందర్భంగా గత ఏప్రిల్ నెలలో దత్త దీక్ష మాల ధరించిన 800 మందికి పైగా స్వాములు శనివారం సాయంత్రం కలశాలతో ఊరేగింపులో పాల్గొన్నారు. ముందుగా వీరు గ్రామంలోని రామాలయం వద్ద కలశా లను ఉంచి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. సాయంత్రం దత్తాత్రేయస్వామిని ట్రాక్టర్‌పై గ్రామంలో ఊరేగించారు. ఈ ఊరేగింపులో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు.


దత్తాత్రేయుడిని ఊరేగిస్తున్న భక్తులు

ఆరాధనోత్సవానికి ఏర్పాట్లు పూర్తి

దత్తాత్రేయస్వామి మందిరం వద్ద ఆదివారం జరగనున్న స్వామివారి ఆరాధన మహోత్సవానికి ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. స్వామి వారిని దర్శించుకునేందుకు పలు ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివస్తారు. ముఖ్యంగా భక్తులు ప్రతి శనివారం రాత్రి ఈ దేవాలయం వద్దకు వచ్చి రాత్రికి అక్కడే నిద్రించి ఆదివారం ఉదయం స్వామివారిని దర్శించుకొని పూజలు చేసి వెళతారు. దీంతో ప్రతి శని, ఆదివారాల్లో ఇక్కడ భక్తుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. ఈ ఆరాధన మహోత్సవాన్ని పురస్కరించుకొని ఆలయ నిర్వాహకులు భక్తుల కోసం మంచినీరు, అన్నదాన సౌకర్యం కల్పించారు. అలాగే రాత్రి దత్తదీక్ష మాలాధారులచే పండరి భజన, అగ్నిగుండ ప్రవేశం ఉంటుందని ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త పవని నాగేంద్రప్రసాద్ చెప్పారు.

ఘనంగా వాసవీ అమ్మవారి జయంతి వేడుకలు


కలశాల ఊరేగింపులో పాల్గొన్న ఆర్యవైశ్య మహిళలు

కందుకూరు, మే 18: వాసవీ కన్యకాపరమేశ్వరి జయంతి వేడుకలను శనివారం కందుకూరు పట్టణంలో ఆర్యవైశ్యులు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన వీధులలో ఆర్యవైశ్య మహిళలు కలశాల ఊరేగింపు, అమ్మవారి నగరోత్సవం నిర్వహించటంతో పాటు పెద్దబజారులో ఉన్న వాసవీ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. వాసవీక్లబ్ లెజెండ్స్, వాసవీ వనితాక్లబ్‌ల ఆధ్వర్యంలో పట్టణంలోని వాసవీ గ్రంథాలయంలో అమ్మవారి జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు అమ్మవారి తీర్థప్రసాదాలు పంపిణీచేశారు.

వైభవంగా వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవం


ప్రత్యేక అలంకారంలో వీరబ్రహ్మేంద్రస్వామి

సంగం, మే 18: స్థానిక కొత్తూరులో వెలసి ఉన్న వీర బ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ఆరాధన మహోత్సవం శనివారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా పోతూరి వీర బ్రహ్మేంద్రస్వామి, ఈశ్వరమ్మ మూల విరాట్‌లకు అభిషేకాలు నిర్వహించి పూలతో అలంకరించారు. అనంతరం భక్తులు పాల్గొని పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదాన ప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

బోగోలు మండలంలో

బిట్రగుంట : బోగోలు మండలంలోని పలు బ్రహ్మంగారి మఠాల్లో వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన ఉత్సవాలు శనివారం జరిగాయి. విశ్వనాథరావుపేట పంచాయతీ కొత్తూరులో ఉన్న మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన ఉత్సవం నిర్వహించారు. ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజలు, విఘ్నేశ్వర పూజలు, మధ్యాహ్నం అన్నసంతర్పణ కార్యక్రమం జరిగాయి. రాత్రి భజన కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కొండబిట్రగుంట, పాతబిట్రగుంట బ్రహ్మగారి మఠాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి.

వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు

ఉలవపాడు, మే 18: మండల కేంద్రం ఉలవపాడులోని రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణు గోపాలస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈనెల 27వ తేదీ వరకు స్వామివారికి రోజు అఖండ దీపారాధన, నిత్య త్రికాల మహానివేదన, ప్రత్యేక అలంకరణ, పూజలు జరిపించి 24న స్వామివారి రథోత్సవం జరుగుతుందని దేవస్థానం కార్యనిర్వాహణ అధికారి కుడారి పెండల వరప్రసాద్ తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు, భక్తులు బ్రహ్మోత్సవాలలో పాల్గొని స్వామివారి కృపాకటాక్షములు పొందాలని దేవస్థానం వ్యవస్థాపక ధర్మకర్తలు కోటిరెడ్డి సుధీష్ చంద్రారెడ్డి కోరారు.

మాలకొండ ఆదాయం రూ. 12,75,827

వలేటివారిపాలెం, మే 18 : మండలంలోని మాలకొండ లక్ష్మీనరసింహస్వామికి శనివారం భక్తుల నుండి రూ. 12,75,827 ఆదాయం లభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ కేబీ శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. వివరాలిలా ఉన్నాయి అష్టోత్తరం టిక్కెట్‌ల ద్వారా రూ. 7,900, కుంకుమార్చన ద్వారా రూ. 28,600, వివాహముల ద్వారా రూ. 1000, తలనీలాలు ద్వారా రూ. 91,700, వాహన పూజలు ద్వారా రూ. 5,280, ప్రత్యేక దర్శనం ద్వారా రూ. 5,22,600, స్థలపురాణం పుస్తకాలు విక్రయం ద్వారా రూ. 480, రూముఅద్దెలు ద్వారా రూ. 35,250, కవర్లు ద్వారా రూ. 8,700, లడ్డుప్రసాదం ద్వారా రూ. 2,13,505, అన్నదానం ద్వారా రూ. 3,28,696, విరాళముల ద్వారా రూ. 32,116 ఆదాయం లభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసరావు తెలియజేశారు.

నేటినుంచి పాండురంగ విఠలేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల ప్రారంభం

సీతారామపురం, మే 18 : మండలంలోని నారాయణప్ప పేటకు నైరుతి దిశాన పండ్రంగి గ్రామ సమీపంలో కావు కొండ సానువులపై వెలసి ఉన్న శ్రీ పాండు రంగ విఠలేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు మే 19వ తేదీ నుంచి 23వ తేది వరకు జరుగుతాయని దేవస్థాన కమిటీ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేవస్థాన కమిటీ మాట్లాడుతూ మే 19వ తేదీ ఉదయం 7గంటలకు కలశ స్థాపనతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమై 22వ తేది స్వామి వారి కల్యాణం, 23వ తేదీ గురువారం రథోత్సవం, పారు వేటతో స్వామి వారి బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని వారు తెలిపారు.


శ్రీ పాండు రంగ విఠలేశ్వర స్వామి

ప్రజల మనసులు గెలిచాం..!

● పసుపులేటి సుధాకర్, సుగుణమ్మ దంపతులు

కావలిటౌన్, మే 18: స్వతంత్ర అభ్యర్థినైనా ప్రజల ఆదరాభిమానాలు చూరగొని వారి మనసులను గెలిచామని కావలి నియోజకవర్గ స్వతంత్ర ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన పసుపులేటి సుధాకర్, సుగుణమ్మ దంపతులు పేర్కొన్నారు. పసుపులేటి దంపతులు ఆంధ్రజ్యోతితో ఎన్నికల తీరు పట్ల తమ మనోభావాలు పంచుకున్నారు. వారు మాట్లాడుతూ ఎన్నికల తీరు, పోలింగ్ సరళిని, ప్రజల ఆదరణను బట్టి చూస్తే తాము తప్పక గెలుస్తామన్న ధీమా కలుగుతోందన్నారు. సహకరించిన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. తమకు కుళ్ళు రాజకీయాలు తెలియదని, ప్రజలకు చేతనైనంత సాయం, సేవ చేయడమే తెలుసన్నారు. బోగోలులో పుట్టి పెరిగి పేదరికాన్ని అనుభవించి కష్టపడి అంచెలంచలుగా ఎదిగామన్నారు. ఈక్రమంలో జన్మభూమి రుణం తీర్చుకోవాలన్న దృఢమైన సంకల్పమే పీఎస్సార్ ట్రస్ట్‌కు పునాది పడిందన్నారు. 20ఏళ్ళ నుంచి నిరాటంకంగా నియోజకవర్గంలో సొంత నిధులతో అభివృద్ధి, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రజల ఆకాంక్ష మేరకు ఎన్నికల్లో పోటీచేశామని పదవుల కోసం కాదని, ఇతర ప్రాంతాల్లో ఎమ్మెల్యేగా, ఎంపీగా పోటీ చేసేందుకు ప్రధాన పార్టీలు టిక్కెట్ ఇచ్చేందుకు ముందుకొచ్చినప్పటికీ సున్నితంగా తిరస్కరించానన్నారు. ప్రజల నుంచి తమపట్ల వచ్చిన ఆదరణ చూసి ఓర్వలేనివారు తమపై లేనిపోని ఆరోపణలు, దుష్ప్రచారం చేశారన్నారు. జీవితకాలం కావలి నియోజకవర్గాన్ని వీడమని, రాజకీయాలు, పదవులతో పనిలేకుండా తమవంతు అభివృద్ధి, సాయం, సేవ చేస్తామని స్పష్టం చేశారు.


పసుపులేటి సుధాకర్, సుగుణమ్మ దంపతులు

డీసీపల్లి పొగాకు బోర్డులో ధరలు

మర్రిపాడు. మే 18: డీసీపల్లి పొగాకు బోర్డులో ధరలు రైతులకు రోజు రోజుకు ఊరటనిస్తున్నాయి. శనివారం బోర్డుకు రైతులు 881 బేళ్లను తీసుకొని రాగా, 21 కంపెనీల ప్రతినిధులు వేలంలో పాల్గొని 794 బేళ్లను కొనుగోలు చేశారు. వివిధ కారణాలతో 81 బేళ్లను తిరస్కరించారు. కిలో గరిష్ఠ ధర రూ308 కాగా, కనిష్ఠ ధర రూ205 పలకగా సగటున ధర రూ274.29గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి జీ.రాజశేఖర్ తెలిపారు.

ఘాట్‌రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ఆందోళన

ఉదయగిరి రూరల్, మే 18: ఇటీవల కురిసిన వర్షాలకు కోతకు గురైన ఉదయగిరి- బండగానిపల్లి ఘాట్‌రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని స్థానిక ఆర్‌అండ్‌బీ కార్యాలయం ఎదుట శనివారం సీపీఎం ఆధ్వర్యంలో కొండకింద గ్రామాల ప్రజలు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు కాకు వెంకటయ్య మాట్లాడుతూ కొన్నిరోజులుగా కురుస్తున్న అకాల వర్షాలకు ఘాట్‌రోడ్డు కోతకు గురై పెద్దపెద్ద గుంతలు ఏర్పడి వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పది రోజులుగా ఇదే పరిస్థితి ఉన్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఎన్నికల సమయంలో ఘాట్‌రోడ్డు నిర్మాణమంటూ పాలకులు హడావుడి చేస్తారే తప్ప పట్టించుకున్న దాఖలాల్లేవన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఘాట్‌రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పలు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.


ఆందోళన చేస్తున్న గ్రామస్థులు

రాయితీపై పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ

కలిగిరి, మే 18: వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 50శాతం రాయితీపై రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు అందజేస్తున్నట్లు వ్యవసాయాధికారి ఎం సురేష్‌బాబు శనివారం తెలిపారు. మండలంలో జీలుగ 22 క్వింటాళ్ళు, పిల్లిపెసర 143 క్వింటాళ్ళు, జనుము 116 క్వింటాళ్ళు అందుబాటులో ఉన్నాయన్నారు. రాయితీపై సరఫరా చేసే విత్తనాలను ఆన్‌లైన్ విధానంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా సోమవారం నుండి పంపిణీచేయడం జరుగుతుందన్నారు. పచ్చిరొట్ట విత్తనాలు కావలిసిన రైతులు ఆధార్‌కార్డు, పట్టాదారుపుస్తకం తప్పనిసరిగా తీసుకురావాలని కోరారు. పచ్చిరొట్ట విత్తనాలు తీసుకున్న రైతులు సాగుబడి తప్పనిసరిగా చేయాలన్నారు, లేదా ప్రభుత్వం ద్వారా అందే ప్రయోజనాలు నిలిపివేయబడతాయని పేర్కొన్నారు.

బిలకూట క్షేత్రంపై మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభం

బిట్రగుంట, మే 18: బోగోలు మండలం కొండబిట్రగుంట బిలకూట క్షేత్రం ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో దాత గుర్రం ప్రభాకర్ 3లక్షల రూపాయల వ్యయంతో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంటును శనివారం ప్రారంభించారు. ప్రభాకర్ కుటుంబసభ్యులు మొదట స్వామి, అమ్మవార్లను దర్శించుకుని అర్చకులచే ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో రాధాకృష్ణ వారికి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే బిలకూట క్షేత్రవాసిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు గుర్రం కుటుంబ సభ్యులు అన్న సంతర్పణ ఉభయకర్తలుగా వ్యవహరించారు.


పూజా కార్యక్రమంలో దాతలతో ఈవో రాధాకృష్ణ

నేడు పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి

ఉదయగిరి రూరల్, మే 18: స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో ఆదివారం కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సీపీఎం మండల కార్యదర్శి షేక్ ఫరుద్దీన్‌బాషా శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి సీపీఎం, సీఐటీయూ సంఘాల నాయకులు, కార్మికులు, కర్షకులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

బీసీజీ వ్యాక్సిన్‌కు రిజిస్ట్రేషన్ చేసుకోండి

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), మే 18: అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్‌కు అర్హులైన ప్రతిఒక్కరూ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని వైద్యాధికారి అయూబ్‌అఫ్సర్ శనివారం తెలిపారు. మండలంలోని అన్ని సచివాలయాల్లో ప్రతి గురువారం అడల్ట్ బీసీజీ టీకా వేయడం జరుగుతుందన్నారు.

సామాజిక మరుగుదొడ్లు లేక ప్రయాణికుల అవస్థలు

● పట్టించుకోని అధికారులు

వలేటివారిపాలెం, మే 18: మండల కేంద్రమైన వలేటివారిపాలెం బస్టాండు సెంటరులో సామాజిక మరుగుదొడ్లు లేక ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా మహిళా ప్రయాణికులు పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. మల మూత్ర విసర్జనకు సుమారు రెండు ఫర్లాంగుల దూరం చిల్లచెట్ల మాటుకు వెళ్లవలసిన పరిస్థితి నెలకొందని మహిళా ప్రయాణికులు వాపోతున్నారు. చెన్నై, విజయవాడ, హైదరాబాద్, తిరుపతి, వైజాగ్, నెల్లూరు తదితర పట్టణాలకు వివిధ పనులపై వెళ్లేందుకు చుట్టుపక్కల ప్రాంతాల నుండి ప్రతి నిత్యం వేలాది మంది ప్రయాణికులు వలేటివారిపాలెం బస్టాండు సెంటరుకు వస్తుంటారు. అంతేగాకుండా ప్రతి శనివారం మాలకొండ పుణ్యక్షేత్రానికి వెళ్లేందుకు వేలాది మంది భక్తులు వలేటి వారిపాలెం బస్టాండు సెంటరుకు వస్తుంటారు. దీంతో బస్టాండు సెంటరు నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉంటుంది. అలాంటి బస్టాండు సెంటరులో సామాజిక మరుగదొడ్లు లేక నిత్యం ప్రయాణికులు మల మూత్ర విసర్జనకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. బస్టాండు సెంటరులో సామాజిక మరుగుదొడ్లు నిర్మించి రూ. 5, రూ. 10 వసూలుచేసే విధంగా ఏర్పాట్లుచేస్తే పంచాయతీకి అదనపు ఆదాయం చేకూరడమే కాకుండా ఒకరిద్దరికి ఉపాధి కలుగుతుందని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బస్టాండు సెంటరులో సామాజిక మరుగుదొడ్లు నిర్మించి ప్రయాణికుల ఇబ్బందులను తొలగించాలని పలువురు కోరుతున్నారు.


వలేటివారిపాలెం బస్టాండు సెంటరు

అన్నప్రసాద భవనానికి విరాళం


విరాళం అందజేస్తున్న భక్తులు

కందుకూరు, మే 18: పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయం వద్ద నిర్మిస్తున్న అన్నప్రసాద వితరణ భవనానికి గోరంట్ల పున్నయ్య, పద్మావతి దంపతులు శనివారం రూ. 50వేలు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో అయ్యప్పసేవాసంఘం కమిటీ సభ్యులు కేఎస్ వెంకటేశ్వర్లు, ఇస్కాల వెంకటనరసింహ్మం, నల్లబోతుల మురళీ, మాదాల వెంకటేశ్వర్లు, కాటా చెంచురామయ్య, దాసరి శ్రీనివాసులు, ఉన్నం వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

బావిలో పడి దుప్పి మృతి


మరణించిన దుప్పి

ఉలవపాడు, మే 18 : దారితప్పి జనావాసాల్లోకి వచ్చిన ఓ దుప్పి కుక్కల దాడి నుంచి తప్పించుకునే క్రమంలో ప్రమాదవశాత్తు బావిలో పడి గాయాలపాలై మృతిచెందిన సంఘటన శనివారం జరిగింది. ఉలవపాడు ఫారెస్ట్ సెక్షన్ అధికారి నరసయ్య, గార్డ్ సుభానీ తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. రైల్వే ట్రాక్‌కు తూర్పున ఉన్న చిట్టడవి నుంచి ఒక దుప్పి దారితప్పి గ్రామంలోకి వచ్చింది. వీధి కుక్కలు వెంబడించడంతో వాటి నుంచి తప్పించుకునే క్రమంలో వడ్డెరపాలెం వద్ద కమ్యునిటీ హాల్ ఎదురుగా ఉన్న ప్రహరీ గోడను దాటే సమయంలో పక్కనే ఉన్న బావిలో పడింది. స్థానికులు ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించడంతో వారు దుప్పిని బావిలో నుంచి బయటకు తీసి పశువైద్యశాలకు తరలించి చికిత్స అందించారు. అనంతరం ఫారెస్ట్ బంగళాకు తీసుకెళ్లిన కొద్దిసేపటికే మృతి చెందింది. నియమ నిబంధనల ప్రకారం దుప్పికి పోస్టుమార్టం నిర్వహించి దహనం చేసినట్లు ఫారెస్ట్ సిబ్బంది తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

ఉలవపాడు, మే 18 : రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతిచెందిన సంఘటన ఉలవపాడు జాతీయ రహదారి మన్నేటికోట అడ్డరోడ్డు వద్ద శుక్రవారం రాత్రి జరిగింది. ఎస్సై బాజీరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. కోవూరుకి చెందిన దేవళ్ల రాధాకృష్ణారెడ్డి (65) పొలాల్లో రైతుల పాత విద్యుత్ మోటార్లు కొని అమ్ముకుంటూ ఉంటాడు. ఈక్రమంలో ఉలవపాడుకు వచ్చిన రాధాకృష్ణారెడ్డి శుక్రవారం రాత్రి మన్నేటికోట వద్ద రోడ్డు దాటుతుండగా నెల్లూరు వైపు వెళ్లే గుర్తుతెలియని కారు ఢీకొని ఆగకుండా వెళ్లిపోయింది. దీంతో రాధాకృష్ణారెడ్డి అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం సీహెచ్‌సీకి తరలించి కేసు నమోదుచేసి ప్రమాదానికి కారణమైన కారును గుర్తించే పనిలో ఉన్నట్లు ఎస్సై తెలిపారు.

ఎన్నికల ఫలితాలపై పల్లెల్లో పందేలు

సీతారామపురం, మే 18 : సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ ముగియడంతో ఎర్టీలకు చెందిన పలువురు నాయకులు తమ పార్టీ అంటే తమ పార్టీ గెలుస్తుందని పల్లెల్లో పందేలు కాస్తున్నారు. టీడీపీ ప్రభుత్వం వస్తుందని, ఉదయగిరిలో కాకర్ల సురేష్ విజయం సాధిస్తారని ఆ పార్టీ నాయకులు, అలాగే వైసీపీ వారు తమ పార్టీనే మరలా వస్తుందని బెట్టింగ్‌లు కాస్తున్నారు. ఇంకా ఓట్ల లెక్కింపునకు 17 రోజుల సమయం ఉండడంతో పల్లెల్లో బెట్టింగులు మరింత జోరందుకునే అవకాశం ఉంది. ఉదయగిరి నియోజకవర్గంలో 83.64 శాతం పోలింగ్ జరగడంతో ఇరు పార్టీల వారు గెలుపు తమదేనంటూ ధీమాతో ఉన్నాయి.

కావ్యతోనే కావలి కనకపట్నం

● కాపు నేతల అభినందనలు

కావలి, మే 18: కావలి కనకపట్నం కావాలంటే టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డితోనే సాధ్యమవుతుందని కాపు నేతలు పేర్కొన్నారు. కావలి పట్టణం ముసునూరులోని టీడీపీ కార్యాలయంలో శనివారం కాపునేతలు కావ్య క్రిష్ణారెడ్డిని కలిసి భారీ మెజార్టీతో విజయం తథ్యమని పుష్పగుచ్ఛం అందచేసి అభినందనలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ గత ఐదేళ్లలో వైసీపీ పాలనలో కాపులపై దాడులు, మహిళల పట్ల అనుచితంగా ప్రవర్తించి వారిపై కూడా కేసులు పెట్టడం జరిగిందన్నారు. చిన్న సమస్యను కూడా పరిష్కరించలేని ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి కాపునేత సురేష్ చావుకు కారకుడయ్యాడని ఆరోపించారు. ఎమ్మెల్యే కాపులకు ఎలాంటి రాజకీయ పదవులలో ప్రాధాన్యత కల్పించలేదన్నారు. ఎన్నో అవమానాలను, దాడులను, దౌర్జన్యాలను ఎదుర్కొన్న కాపులంతా ఏకమై ఎన్నికలలో టీడీపీ అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డిని ఆశీర్వదించటం జరిగిందన్నారు. కావ్య మాట్లాడుతూ తన గెలుపునకు విశేషంగా కృషిచేసిన కాపులకు ఎల్లవేళలా రుణపడి ఉంటానని, టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే వారికి ఇచ్చిన హామీలు అమలు చేస్తానన్నారు.


కావ్య క్రిష్ణారెడ్డికి పుష్పగుచ్ఛం అందచేస్తున్న బలిజ, కాపు నేతలు

వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో పూజలు

కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆశీస్సులు అందరికీ ఉండాలని క్రిష్ణారెడ్డి తెలిపారు. వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంతి సందర్భంగా శనివారం ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలలో క్రిష్ణారెడ్డి పాల్గొని అమ్మవారి ఆశీస్సులు అందుకున్నారు.

దాహార్తి తీరుస్తున్న మహిళల సేవలు అభినందనీయం

రోడ్ల వెంబడి పాదాచారుల దాహార్తి తీర్చేందుకు ట్రంకు రోడ్డు వెంబడి చలివేంద్రం ఏర్పాటు చేసిన ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ కావలి మహిళా విభాగం సేవలు అభినందనీయమని టీడీపీ అభ్యర్థి క్రిష్ణారెడ్డి తెలిపారు. కావలి అర్చక సంఘం అధ్యక్షుడైన శ్రీనివాసాచార్యులు పుట్టినరోజు సందర్భంగా తొలిరోజు చలివేంద్రంలో మజ్జిగ, పులిహార, మిఠాయిలు పంపిణీ చేయటంతో ఆయనను క్రిష్ణారెడ్డి అభినందించారు.

రూపు కోల్పోతున్న ఉదయగిరి ఆనకట్ట

● పట్టించుకోని అధికారులు

ఉదయగిరి, మే 18 : ఉదయగిరిని శ్రీకృష్ణ దేవరాయులు పరిపాలిస్తున్న సమయంలో పట్టణానికి ఈశాన్యంలో ఆనకట్ట నిర్మించారు. వర్షాలకు ఈ ఆనకట్ట నిండితే బోర్లకు నీటిమట్టం పెరిగి ప్రజలకు కొళాయిల ద్వారా నీటి సరఫరా అందేది. అలాంటి ఆనకట్ట రోజు రోజుకి రూపు కోల్పోయి జమ్మూగుర్రపు డెక్కతో నిండిపోయింది. పట్టణంలో సుమారు 3 వేల నివాస గృహాలు, 20 వేల మంది జనాభా ఉన్నారు. పట్టణంలోని కోళ్ల వీధి, ఆవుల వీధి కరిమ వీధి, బాలాజీ నగర్, నాగుల బావి వీధి, అగ్రహారం షామీర్ షా వీధి, దేవలగడ్డ గొల్లపాలెం తదితర వీధుల్లో నుంచి వచ్చే మురికి నీరు, ప్లాస్టిక్ వ్యర్థాలు ఆనకట్టలో పేరుకుపోయి నీరు కలుషితమవుతోంది. టీడీపీ హయాంలో అయినా కొంతమేర ఆనకట్ట పూడిక పనులు జరిగాయి, కానీ వైసీపీ పాలనలో అభివృద్ధి లేక పనులు కుంటుపడ్డాయి, ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆనకట్టలో మొలచిన జమ్మూగుర్రపు డెక్క, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి నీరు కలుషితం కాకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.


ఆనకట్టలో ప్లాస్టిక్ వ్యర్థాలతో పేరుకుపోయిన నీటి బోరు

క్రీడా మైదానంలో పరిశుభ్రత మరిచారు..!

ఉదయగిరి రూరల్, మే 18: స్థానిక ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఈవీఎంల డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని నిర్వహించిన అధికారులు అనంతరం పరిశుభ్రతను మరిచారు. ఎన్నికల విధుల్లో పాల్గొన్న అధికారులు, సిబ్బందికి అందజేసిన భోజనాల ప్యాకెట్లు, తదితర వాటిని శుభ్రం చేయక మైదానంలోనే వదిలేశారు. ఈ క్రీడా మైదానంలో యువకులు ప్రతిరోజు క్రికెట్, ఇతరత్రా ఆటలు ఆడుతూ మానసికోల్లాసాన్ని పొందుతున్నారు. అయితే మైదానంలో ఎక్కడ చూసినా చెత్తాచెదారం ఉండడంతో ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి మైదానాన్ని శుభ్రం చేయించాలని పలువురు కోరుతున్నారు.


చెత్తాచెదారంతో నిండిన క్రీడా మైదానం

ఆత్మకూరులో ట్రాఫిక్ సమస్య

● ఇబ్బందులు పడుతున్న వాహనదారులు, ప్రజలు

ఆత్మకూరు, మే 18 : ఆత్మకూరు పట్టణంలో ట్రాఫిక్ సమస్య అస్తవ్యస్తంగా తయారైంది. దుకాణాలు, హోటళ్ల ఎదురుగా వాహనాలను అడ్డదిడ్డంగా రోడ్లపైనే నిలిపేయడంతో ప్రజలు, ద్విచక్రవాహనదారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అంతేకాకుండా తోపుడుబండ్లను కూడా రోడ్డుపైనే అడ్డంగా ఉంచి వ్యాపారాలు చేసుకుంటుండడంతో ట్రాఫిక్ సమస్య మరింత జఠిలమవుతోంది. పట్టణంలోని ఆర్టీసి బస్టాండ్ సెంటర్ నుంచి సోమశిల రోడ్డు సెంటర్ వరకు నాలుగురోడ్ల నిర్మాణం ప్రశ్నార్థకంగా మారింది. దాంతో ఆర్టీసి బస్టాండ్‌సెంటర్ నుంచి సోమశిలరోడ్డు సెంటర్ వరకు ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ ఎక్కువగా స్తంభిస్తోంది. దానికితోడు వరిగడ్డి ట్రాక్టర్లు కూడా అటుగానే వస్తుండడంతో వాహనాలు నిలిచిపోతున్నాయి దీంతో ట్రాఫిక్ సమస్య మరింత ఎక్కువై ప్రజలు, వాహనదారులు వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా ఆటోలను కూడా ఎక్కడ పడితే అక్కడ నిలిపి ప్రయాణికులను ఎక్కిస్తుండడంతో వెనకాల ఉండే బస్సులు సైతం రోడ్డుపైనే నిలిచిపోతున్నాయి. దుకాణాలు, హోటళ్ల ఎదురుగా వాహనాలను నిలుపుకునేందుకు స్థలం లేకపోవడంతో వాహనాలను రోడ్లపైనే నిలుపుకోవాల్సిన పరిస్థితి. దీంతో ప్రతి చోట అడుగడుగునా ట్రాఫిక్ సమస్యతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి ట్రాఫిక్ సమస్య లేకుండా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.


పట్టణంలోని సోమశిలరోడ్డు సెంటర్‌లో నిలిచిపోయిన ట్రాఫిక్

అగ్నిప్రమాదాలు జరిగితే ఆహుతి అవ్వాల్సిందే..

● అగ్నిమాపక కేంద్రం లేక ప్రజల ఇబ్బందులు ● పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు

అల్లూరు, మే 18 : మండలంలో అగ్నిమాపక కేంద్రం లేకపోవడంతో ఏదైనా అగ్నిప్రమాదం చోటుచేసుకుంటే నిలువునా అగ్నికి ఆహుతవ్వాల్సిందేనని, వేసవికాలం సమీపిస్తుందంటే ఏ సమయంలో ఏ అగ్ని ప్రమాదం సంభవిస్తుందోనని బిక్కుబిక్కుమంటూ ఉండాల్సి వస్తోందని ప్రజలు, రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలానికి సమీపంలో అగ్నిమాపక కేంద్రం లేకపోవడంతో అగ్ని ప్రమాదం జరిగితే సుదూర ప్రాంతాలైన కావలి, నెల్లూరు నుండి అగ్నిమాపక కేంద్రం నుంచి సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పేసరికే అంతా కాలి బూడిద అయిపోతుంది. వచ్చినవారు చివరి సమయంలో ఉన్న మంటలను ఆర్పడం తప్ప ఇంకేమీ లాభం లేకుండా పోతోంది. అప్పటికే స్థానికులు మంటలను ఆర్పేయడం, బాధితులు నష్టపోవడం అంతా జరిగిపోతుంది. ఒక ప్రాంతంలో అగ్ని ప్రమాదం సంభవిస్తే వేసవి కాలం కావడంతో చుట్టుపక్కల ఉండే గడ్డివాములు, పూరిగుడిసెలు తదితరాలకు నిప్పంటుకొని భారీ నష్టాలు చవిచూడాల్సి వస్తోందని ప్రజలు, రైతులు వాపోతున్నారు.


అగ్నిప్రమాదానికి గురైన గృహాలు (ఫైల్)

అల్లూరులో అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి

మండల కేంద్రమైన అల్లూరులో గత ప్రభుత్వాలు అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలనే ఆలోచనలు చేశాయి. ఇక్కడ ఏర్పాటుచేస్తే అల్లూరుతోపాటు కొడవలూరు, దగదర్తి, బోగోలు మండలాలకు అందుబాటులో ఉంటుంది. ఈ ప్రాంతాల్లో అగ్నిప్రమాదం చోటుచేసుకున్న అరగంటలోపే ఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదాన్ని అరికట్టవచ్చు. ప్రస్తుతం నెల్లూరు, కావలిలోని అగ్నిమాపక కేంద్రాల నుంచి సిబ్బంది ఘటనా స్థలానికి రావాలంటే దాదాపు మూడు గంటల వ్యవధి పడుతోంది. దీంతో ప్రమాద స్థలంలో పూర్తిగా ఆస్తులు నష్టపోవాల్సి వస్తోంది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి అల్లూరులో అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని గ్రామస్థులు, రైతులు కోరుతున్నారు.

నెల్లూరు సిటీ, రూరల్

కోవూరు, సర్వేపల్లి

‘టిడ్కో’లో సమస్యల తిష్ఠ!

- అధ్వానంగా పారిశుధ్యం
- రోడ్లపైనే వ్యర్థాలు, మురుగు
- దోమలతో అల్లాడుతున్న ప్రజలు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు



రోడ్లపై పేరుకుపోయిన చెత్తచెదారాలు

నెల్లూరు(వెంకటేశ్వరపురం), మే 18 : వెంకటేశ్వరపురంలో పేదల కోసం గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించిన టిడ్కో నివాసాల చుట్టూ సమస్యలు తిష్ఠ వేశాయి. పారిశుధ్యం అధ్వానంగా ఉంది. వ్యర్థాలు, మురుగు రోడ్లపైకి చేరి అపరిశ్రుభత నెలకొంది. దోమలు, పందులకు అవాస కేంద్రాలుగా మారి రేయింబవళ్లు ప్రజలపై దాడి చేస్తుండడంతో వ్యాధుల భయంతో ప్రజలు అల్లాడుతున్నారు. అయినా సంబంధిత మున్సిపల్ అధికారులు ఇటువైపు కన్నెత్తి చూసిన పాపాన పోవడంలేదు. ఇక్కడ మూడు కేటగిరీల్లో మొత్తం 4800 నివాసాలను నిర్మించారు. వీటిలో 70 శాతం మేరకు పేదలు, మధ్య తరగతి ప్రజలు నివాసం ఉంటున్నారు. అయితే వైసీపీ ప్రభుత్వం వచ్చినప్పటి నంచి టిడ్కో నివాసాల సముదాయంలో ప్రజల సమస్యలను పట్టించుకోనేవారు కరువయ్యారు. నిత్యం అనేక సమస్యల తో ఇబ్బందులు పడుతున్నారు. అందులో ప్రాధానంగా పారిశుధ్యం, ఎక్కడ చూసినా రోడ్లపై చెత్త, వ్యర్థాలు దర్శనమిస్తున్నాయి. డ్రైనేజీ వ్యవస్థను పట్టించుకోనేవారు లేకపోవడంతో మురుగు నీరు మొత్తం రోడ్లపైకి వస్తోంది. పేరుకు శానిటేషన్ అధికారులు, సిబ్బంది ఉన్నా ఈ ప్రాంతంలో పారిశుధ్యాన్ని పట్టించుకోవడం వదిలేశారు. అనేక చోట్ల విషసర్పాలు సైతం ఎక్కువుగా ఉన్నాయని స్థానిక ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా టిడ్కో నివాసాల సముదాయంలో పారిశుధ్యంపై దృష్టి పెట్టాలని స్థానికులు కోరుతున్నారు.



టిడ్కో నివాసాల వద్ద పేరుకుపోయిన వ్యర్థాలు



టిడ్కో ఇళ్ల చుట్టూ పేరుకుపోయిన మురుగు

కోవూరులో ప్రశాంతిరెడ్డి విజయం తథ్యం



బెజవాడ వంశీకృష్ణారెడ్డి

విడవలూరు, మే 18: సార్వత్రిక ఎన్నికల్లో కోవూరు ఉమ్మడి అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డికి మండల ప్రజానీకరం బ్రహ్మరథం పట్టారని, ఆమె విజయం తథ్యమని టీడీపీ నాయకుడు బెజవాడ వంశీకృష్ణారెడ్డి తెలిపారు. ఊటుకూరులో శనివారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రశాంతిరెడ్డి జిల్లాలోనే అత్యధిక మెజార్టీతో గెలవబోతుం దన్నారు. ఆమె గెలుపునకు గ్రామ స్థాయి నాయకులు, కార్యకర్తలు ఎంతగానో పాడుపడ్డారని, వారికి పేరుపేరున ధన్యవాదాలు తెలిపారు. కోవూరు మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి గెలుస్తాడని వైసీపీ నాయకులు మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శించటం హాస్యాస్పదంగా ఉందని, వైసీపీకి డిపాజిట్లు కూడా రావన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రశాంతిరెడ్డి ఇచ్చిన హామీలు నెరవేరుస్తారని, అందుకే ఓటర్లు ఆమెను అత్యధిక మెజార్టీతో గెలిపించి అసెంబ్లీకి పంపుతున్నారని ఆయన స్పష్టం చేశారు. రానున్న రోజుల్లో పాత, కొత్త నాయకులను, కార్యకర్తలను సమన్వయం చేసుకుని పార్టీ బలోపేతానికి, మండలాభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ప్రశాంతిరెడ్డి గెలుపొందిన తరువాత మంత్రి పదవి చేపట్టాలని మండల ప్రజానీకం కోరుకుంటున్నారని తెలిపారు.

నేడు రక్తదాన శిబిరం

నెల్లూరు(సాంస్కృతికం), మే 18 : బాలాజీనగర్‌లోని సాయిదర్బార్ మందిరం వద్ద శ్రీసాయి దర్బార్ యువసేవాదళ్ ఆధ్వర్యంలో ఆదివారం మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు సాయిదర్బార్ చైర్మన్ మధు సాయి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరం సాయిదర్బార్ యువసేన సభ్యుడు కసుమూరు సాయినాథ్‌రెడ్డి జ్ఞాపకార్థం చేస్తున్నామని పేర్కొన్నారు. ఉదయం 9 నుంచి 1గంట వరకు సాయిమాతా నిత్యాన్న దాన ప్రసాదాలయంలో ఈ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు.

పారిశుధ్య కార్మికులకు తేనేటి విందు



పారిశుధ్య కార్మికులకు తేనేటి విందు ఇస్తున్న కమిషనర్

బుచ్చిరెడ్డిపాళెం, మే 18: ఎన్నికల్లో స్థానిక నగర పంచాయతీ కార్మికులు అందించిన సేవలను అభినందిస్తూ నగర పంచాయతీ కమిషనర్ శనివారం వారికి తేనేటి విందు ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో నగర పంచాయతీలోని పోలింగ్ బూత్‌ల వద్ద పారిశుధ్యం మెరుగుకు వారు అందించిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులు, నగర పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఖగోళశాస్త్ర దినోత్సవం



బుచ్చి శాఖా గ్రంథాలయంలో విద్యార్థులు, అధికారులు

బుచ్చిరెడ్డిపాళెం, మే 18: స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా శనివారం అంతర్జాతీయ ఖగోళశాస్త్ర దినోత్సవం గ్రంథాలయ అధికారి మంజులత అధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అంతరిక్షం అవకాశాల అద్భుతం అన్నారు. అంతరిక్ష రంగంలో విశిష్ట సేవలందించిన కలాం, సునీత విలియమ్స్, రాకేశ్ శర్మ వంటి మహోన్నతుల గురించి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రిసోర్సు సభ్యులు గండికోట సుధీర్‌కుమార్, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అయిదేళ్లుగా పుస్తకాలు లేకుండా చదువులు

- జూన్ 1 నుంచి జూనియర్ కళాశాలల పునఃప్రారంభం

పొదలకూరు, మే 18 : ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మౌలిక వసతులు లేకపోవడంతో పాటు విద్యార్థులకు అవసరమైన పాఠ్యపుస్తకాలు కూడా సరిగ్గా అందడం లేదు. అయిదేళ్లుగా ప్రభుత్వం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయకుండానే కాలం గడిపేయడం గమనార్హం. జూన్ 1 నుంచి కళాశాలలు పునః ప్రారంభం కానున్నాయి. ఈ ఏడాదైనా విద్యార్థులకు పుస్తకాలు అందిస్తారా? లేదా అనేది ప్రశ్నార్థకంగానే ఉంది. ఏటా అధికారులు పుస్తకాల కోసం ఇండెంట్ పెట్టడం వరకే పరిమితమవుతున్నారు. స్తోమత ఉన్నా లేకపోయిన విద్యార్థులు బయట వేలకు వేలు ఖర్చు పెట్టి స్టడీ మెటీరియల్స్‌ను కొనుగోలు చేసుకుని చదువుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇకనైనా ప్రభుత్వం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు ఇచ్చేలా చూడాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

వర్షం పలకరింపు... భూమి పులకరింత !

పొదలకూరు, మే 18 : మండలంతో పాటు జిల్లాలో వర్షాలు మొదలయ్యాయి. ఖరీఫ్ సీజన్ జూన్ నెల నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు రైతులకు కొంత ఊరటనిస్తున్నాయి. మూడు నెలలుగా మండు టెండలు, ఉక్కపోతతో అల్లాడిన ప్రజలకు వర్షం రాకతో ఉపశమనం కలిగినట్లైంది. జిల్లాలో ఇంకా వ్యవసాయ పనులు ప్రారంభం కాలేదు. అయితే ప్రస్తుత కురుస్తున్న వర్షాలకు పచ్చిరొట్ట విత్తనాలు సాగు చేసుకోవడానికి అత్యంత అనుకూలమని వ్యవసాయ శాఖ సూచిస్తోంది. పచ్చిరొట్ట విత్తనాలు సాగు చేసుకుంటే ప్రధాన పంటలు సాగు చేసే సమయానికి ఏపుగా పెరిగిన వాటిని భూమిలో కలియదున్నితే ఉపయోగకరంగా ఉంటుంది. శుక్రవారం తెల్లవారు జాము నుంచి పొదలకూరులో ఒక మోస్తరు వర్షం కురుస్తోంది. దీంతో రైతులు పచ్చిరొట్ట విత్తనాలు సిద్ధం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. మూడు నెలలుగా ఎండలకు ప్రజలు అల్లాడిపోయారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు వాతావరణం చల్లబడడంతో ప్రజలు ఉక్కపోత నుంచి ఉపశమనం పొందారు.

జూన్ 7 వరకు వేసవి విజ్ఞాన శిబిరం



గ్రంథాలయంలో పుస్తకాలు చదువుతున్న పిల్లలు

మనుబోలు, మే 18: వేసవి విజ్ఞాన శిబిరాన్ని వచ్చే నెల 7వరకు నిర్వహిస్తున్నట్లు స్థానిక లైబ్రేరియన్ వాసవి అరుణ్‌కుమార్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 15నుంచి గ్రంథాలయంలో శిబిరం ప్రారంభించామన్నారు. దీనిని పిల్లలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు.

అంబేడ్కర్ విగ్రహం ధ్వంసం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

విడవలూరు, మే 18: వెంకటగిరి పట్టణంలోని క్రాస్ రోడ్డులో ఉన్న అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్లు సాల్మన్‌రాజు తెలిపారు. విడవలూరులో శనివారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ధ్వంసం చేసిన విగ్రహం స్థానంలో కొత్త విగ్రహాన్ని ఏర్పాటుచేయాలని అయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు కె బాబు, ముసలి నరేంద్ర, నక్కగిరి పాల్గొన్నారు.

నేటి నుంచి శత ఛండీయాగం

నెల్లూరు(సాంస్కృతికం), మే 18 : వేదాయపాలెం త్యాగరాజస్వామి మందిరంలో ఆదివారం నుంచి ఈ నెల 21వ తేదీ వరకు శతచండీయాగం జరుగుతుందని మందిరం నిర్వాహకుడు డాక్టరు వై.నాగదేవీప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. త్యాగరాజస్వామి మందిరంలో కేదారనాథ్ నుంచి తెచ్చిన సాలిగ్రామ శివలింగం, కమలాంబిక విగ్రహాలు ప్రతిష్ఠ జరిగి ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా ఈ హోమాలు, యాగాలు జరుగుతుందని పేర్కొన్నారు. ఈ శత ఛండీయాగంలో భక్తులు అందరూ పాల్గొనాలని కోరారు.

నేడు జేఎస్‌రెడ్డి సంస్మరణ సభ

నెల్లూరు(సాంస్కృతికం), మే 18 : ప్రముఖ పారిశ్రామిక వేత్త జక్కా శ్రీనివాసులురెడ్డి సంస్మరణ సభ ఆదివారం సాయంత్రం 6గంటలకు జరు గుతుందని నెల్లూరు రేబాల లక్ష్మీనరసారెడ్డి పురమందిరం ట్రస్ట్ ఒక ప్రక టనలో తెలిపింది. జేఎస్‌రెడ్డి అభిమానులు తరలిరావాలని కోరింది.

బండాసుర వధ అలంకారం



మూలస్థానేశ్వరస్వామి ఆలయంలో బండాసుర వధ అలంకారం స్వామి, అమ్మవారు

నెల్లూరు(సాంస్కృతికం), మే 18 : నగరంలోని మూలాపేట మూలస్థానేశ్వరాలయంలో వసంతోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శనివారం ఉదయం మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, విశేష పూజలు జరిగాయి. భువనేశ్వరీ అమ్మవారికి ఉదయం విశేష పూజలు, పూలంగిసేవ, సాయంత్రం విశేష పూజలు నిర్వహించారు. రాత్రి బండాసుర వధ అలంకారం జరిగింది. ప్రాకారోత్సవం, స్వామివారి తోటలో కుంభహారతులు, తీర్థప్రసాద వితరణలు జరిగాయి.

జీజీహెచ్‌లో అందని ద్రాక్షలా అత్యవసర వైద్యం

- పరికరాలు ఉన్నా ఫలితాలు అంతంత మాత్రమే
- వారం తరువాత రిపోర్టులు ఇస్తున్న రేడియాలజిస్టులు
- రోగ నిర్ధారణ కాక వ్యాధిగ్రస్థుల అవస్థలు
- ఆసుపత్రి చుట్టూ ప్రదక్షిణలు
- పట్టించుకోని ఉన్నతాధికారులు



జీజీహెచ్‌లో ఎంఆర్ఐ పరికరం

నెల్లూరు(వైద్యం) మే 18: ఏ అత్యవసర వ్యాధిగ్రస్థుడికైనా ఆ వ్యాధికి సంబంధించి పరీక్షల ఫలితాలే వైద్యులకు ముఖ్యం. అవి అందితేనే ఆ రోగికి అవసరమైన వైద్య చికిత్సలు అందించేందుకు వీలవుతుంది. ఈ క్రమంలో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి(జీజీహెచ్)లో వ్యాధి నిర్ధారణ రిపోర్టులు మరింత ఆలస్యమవుతున్నాయి. ఇక్కడ ఎంఆర్ఐ, సిటీ స్కాన్ తీయించుకునే రోగులకు వారం, పది రోజులకు కూడా రిపోర్టులు ఇవ్వటం లేదు. పేరుకు స్కానింగ్ కేంద్రంలో నలుగురు రేడియాలజిస్టులు ఉన్నా ఆశించిన స్థాయిలో రిపోర్టులు మాత్రం సకాలంలో ఇవ్వటం లేదు. అదే ప్రైవేట్ స్కానింగ్ సెంటర్‌లో అయితే ఉదయం స్కానింగ్ తీయించుకుంటే సాయంత్రానికి రిపోర్టు ఇస్తారు. అయితే జీజీహెచ్‌లో మాత్రం రోజుల తరబడి ఇవ్వక పోవటంతో అత్యవసర వైద్యసేవలు ఆలస్యమవుతున్నాయి. జీజీహెచ్‌కి ప్రతిరోజూ 1500మంది రోగులు వస్తుంటారు. వీరిలో 550 మందికిపైగా రోగులు ఇన్‌పేషెంట్‌లుగా చేరి అత్యవసర వైద్య చికిత్సలు పొందుతుంటారు. ఇందులో పలువురికి ఎంఆర్ఐ, సిటీ స్కాన్ అవసరం ఉంటుంది. అయితే ఇక్కడ సకాలంలో స్కానింగ్ రిపోర్టులు ఇవ్వక పోవటంతో రోగులు నానా అగచాట్లు పడుతున్నారు.

రోజుకు 50 మందిపైనే..

ప్రతిరోజు జీజీహెచ్‌లో ఎంఆర్ఐ, సిటీస్కాన్ చేయించుకునేందుకు 50 మందికి పైగా రోగులు వస్తుంటారు. ఆసుపత్రిలో ఇన్ పేషెంట్‌లుగా చేరే రోగులు, ప్రమాద బాధితులు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. వీరిలో ఎక్కువ మందికి సిటీస్కాన్, ఎంఆర్ఐ అవసరం ఉంటుంది. ల్యాబ్‌లో ఉన్న టెక్నీషియన్‌లు ఎంఆర్ఐ, సిటీస్కాన్ తీసిన తర్వాత రేడియాలజిస్ట్ వాటిని పరిశీలించి ఫైనల్ రిపోర్టు రాస్తారు. ఆయా రిపోర్టులను పరిశీలించి వైద్యులు చికిత్సలు అందిస్తారు. అయితే ప్రస్తుతం రిపోర్టులు ఇవ్వడంలో ఆలస్యం వల్ల పూర్తిస్థాయి వైద్య సేవలు అందటం లేదు. ఈ స్థితిలో కేవలం రిపోర్టులు ఇవ్వడానికి ఓ రేడియాలజిస్ట్‌ను అందుబాటులో ఉంచితే పూర్తి స్థాయిలో వ్యాధి నిర్ధారణ రిపోర్టులు సకాలంలో అందే అవకాశం ఉంటుంది. ఆ దిశగా జీజీహెచ్ అధికారులు చర్యలు తీసుకోవటం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

మంగళవారం రిపోర్టు ఇస్తామన్నారు..



గత గురువారం నేను ఊపిరితిత్తులకు సంబంధించి వ్యాధితో జీజీహెచ్ స్కానింగ్ కేంద్రంలో సిటీస్కాన్ తీయించుకున్నా. అయితే రిపోర్టు మాత్రం వెంటనే ఇవ్వలేదు. పోని సాయంత్రానికి ఇస్తారనుకుంటే మంగళవారం ఇస్తామన్నారు. దీంతో పూర్తిస్థాయి వైద్య చికిత్సలు అందలేదు. తాత్కాలిక చికిత్సలు మాత్రమే వైద్యులు చేశారు. ఇలా అయితే వ్యాధి ఎప్పుడు నయం అవుతుంది?.

- శీనయ్య, తోటపల్లి గూడూరు

త్వరగా ఇచ్చేలా కృషి చేస్తా...



ఎంఆర్ఐ, సిటీస్కాన్ విభాగంలో వ్యాధి నిర్ధారణ రిపోర్టులు ఆలస్యం అవుతున్నాయన్న విషయం నాకు తెలియదు. రిపోర్టులు త్వరగా ఇస్తేగాని వ్యాధికి పూర్తిస్థాయిలో వైద్య చికిత్సలు అందించటం కష్టం. ప్రతిరోజు ఈ కేంద్రంలో 50 మందికిపైగా స్కానింగ్‌లు జరుగుతుంటాయి. ఈ నేపథ్యంలో పరీక్షలు చేయించుకున్న రోగులందరికీ త్వరగా రిపోర్టులు ఇచ్చేలా రేడియాలజిస్టులకు ఆదేశాలిస్తాం.

- డాక్టర్ సిద్దానాయక్, జీజీహెచ్ సూపరింటెండెంట్

ప్రైవేటు వ్యక్తుల గుప్పిట్లో ‘సెబ్’

- ఓ అధికారి కనుసన్నల్లో వసూళ్లు

ఇందుకూరుపేట, మే 18 : స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్‌లో ప్రైవేటు వ్యక్తులు విధులు నిర్వహిస్తూ ఓ అధికారి కనుసన్నల్లో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. గతంలో కూడా ఈ వ్యక్తులపై అనేక ఫిర్యాదులు చేసినా ఎలాంటి చర్య తీసుకోలేదు. సీఐ స్థాయిలో జరగవలసిన దాడులు, అనుమానితుల గృహాల్లో తనిఖీలు ఈ వ్యక్తులే నిర్వహిస్తూ ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ మేము అధికారులమంటూ హుకూం జారీ చేస్తూ డిపార్ట్‌మెంట్‌కి తలవంపులు తెచ్చే విధంగా వ్యవహరిస్తున్నారు. వీరికి ఎస్ఐ స్థాయి అధికారి వంతపాడుతూ వీరి ద్వారా అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. ఈ అధికారి స్టేషన్‌కు వచ్చిన బాధితులు, నిందితుల పట్ల అసభ్య పదజాలంతో దూషిస్తూ దురుసుగా ప్రవర్తిస్తున్నారు. కొంతమంది పత్రికా ప్రతినిధుల మీద కూడా దురుసుగా ప్రవర్తించిన సంఘటనలు ఉన్నాయి. ఇదేకాకుండా కిందిస్థాయి సిబ్బంది పట్ల కూడా ఈయన ప్రవర్తన సరిగా లేదని ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల ఎలక్షన్ కోడ్ సాకుతో పాడిందే పాట ఆడిందే ఆటగా వ్యవహరించారు. ఈయనగారి వికృతి చేష్టలకు చాలామంది అమాయకులు బలి అయ్యారు. షాపుల వద్ద మద్యం సేవించే అమాయకులను ప్రైవేటు వ్యక్తుల ద్వారా స్టేషన్‌కు తీసుకువచ్చి అక్రమ కేసులు బనాయించి వారి వద్ద రూ.15వేల నుంచి రూ.20వేల వరకు, మండలంలో ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్ల యజమానుల నుంచి నెలకు రూ.15వేలు వసూలు చేస్తున్నారని ఆరోపణలు బలంగా ఉన్నాయి. ఈ ప్రైవేటు వ్యక్తుల అక్రమ వసూళ్లపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ నిర్వహిస్తే అనేక అక్రమాలు వెలుగులోకి వస్తాయని ఇందుకూరుపేట, టీపీగూడూరు, ముత్తుకూరు మండల ప్రజలు పేర్కొంటున్నారు.

రూపు కోల్పోతున్న ఆనకట్ట

- అల్లుకున్న గుర్రపుడెక్క
- పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు
- కలుషితమవుతున్న నీరు
- పట్టించుకోని అధికారులు

ఉదయగిరి, మే 18 : ఉదయగిరిని శ్రీకృష్ణదేవరాయులు పరిపాలిస్తు న్న సమయంలో పట్టణానికి ఈశాన్యంలో ఆనకట్ట నిర్మించారు. వర్షాలకు ఈ ఆనకట్ట నిండితే బోర్లకు నీటిమట్టం పెరిగి ప్రజలకు కొళాయిల ద్వారా నీటి సరఫరా అందేది. అలాంటి ఆనకట్ట రోజు రోజుకి రూపు కోల్పోయి జమ్మూగుర్రపు డెక్కతో నిండిపోయింది. పట్టణంలో సుమారు 3 వేల నివా స గృహాలు, 20 వేల మంది జనాభా ఉన్నారు. పట్టణంలోని కోళ్ల వీధి, ఆవుల వీధి కరిమ వీధి, బాలాజీ నగర్, నాగుల బావి వీధి, అగ్రహారం షామీర్ షా వీధి, దేవలగడ్డ గొల్ల పాలెం తది తర వీధుల్లో నుంచి వచ్చే మురికి నీరు, ప్లాస్టిక్ వ్యర్థాలు ఆనకట్టలో పేరుకు పోయి నీరు కలుషితమ వుతోంది. టీడీపీ హయాంలో అయినా కొంతమేర ఆనకట్ట పూడిక పనులు జరిగాయి, కానీ వైసీపీ పాలనలో అభివృద్ధి లేక పను లు కుంటుపడ్డాయి, ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆనకట్టలో మొలచిన జమ్మూగుర్రపు డెక్క, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి నీరు కలుషితం కాకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.



ఆనకట్టలో మొలచిన జమ్ము, గుర్రపు డెక్క

కుళాయిలు అస్తవ్యస్తం!

- వృథాగా పోతున్న తాగునీరు

నెల్లూరు (సాంస్కృతికం), మే 18 : నగరంలోని 30వ డివిజన్ హెచ్‌కె బాబు న గర్‌లో గత 5 నెలలుగా మంచినీటి పైపులైను 3 చోట్ల లీక్ అవుతోంది. దీంతో తాగు నీరు వృథా కావడమే కాక కలుషితమవుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నగర పాలక సంస్థ వేసిన పబ్లిక్ కుళాయిలకు కుళాయిలు ఊడిపోయా యి. ఫలితంగా తాగునీరు వృథా అవుతోంది. గిరిజన కాలనీ, 55వ నెంబరు ప్లాటు, 42నెంబరు ప్లాటుల వద్ద మంచినీటి పైపులైన్ లీకులు అవుతున్నాయి. ఎన్నిసార్లు నగర పాలక సంస్థ వాటర్‌మెన్‌కు చెప్పినా మరమ్మతులు చేయలేదు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని లీకులు అరికట్టి తాగునీరు ఆదా చేయాలని డిమాండ్ చేశారు.



కుళాయి లేక వృథాగా పోయిన నీరు



కుళాయికి బదులు నీరు పోకుండా పెట్టిన కర్ర







నగరంలో గత నాలుగు రోజులుగా మబ్బులు కమ్మి వాతావరణం చల్లగా మారింది. ఈ క్రమంలో శనివారం సాయంత్రం చంద్రుడి చుట్టూ మేఘాలు కమ్ముకుని క్రమేపీ రంగులు మారుతూ ఇంద్రధనుస్సులా కనిపించి ప్రజలను కనువిందు చేసింది. ఈ దృశ్యాలను పలువురు తిలకించి తమ తమ సెల్ ఫోన్లు, కెమెరాల్లో బంధించారు.

ఫొటోలు : స్టాఫ్ ఫొటోగ్రాఫర్


నృసింహుడి ఆలయం


దేవేరులతో స్వామివారు

పెంచలకోనకు ఉత్సవ కళ

- నేటినుంచి నృసింహుడి బ్రహ్మోత్సవాలు

డక్కిలి, మే 18 : రాపూరు మండలంలోని పెంచలకోనలో ఆదివారం నుంచి నృసింహుడి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి.దట్టమైన అటవీ ప్రాంతంలో స్వయంభువుగా నృసింహ స్వామి వెలిశాడు. ఆదిలక్ష్మి అమ్మవారిని శ్రీవారు పెనవేసుకొని వుండడంతో పెనుశిలగా పిలుస్తారు.ఇక్కడ ఆంజనేయ స్వామి ఆలయ క్షేత్ర పాలకుడు.నెల్లూరుకు 80 కిలోమీటర్లు, రాపూరు నుంచి 32 కిలో మీటర్ల దూరంలో వున్న ఈ క్షేత్రంలో 25వ తేదీవరకు జరిగే ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం గోనుపల్లి నుంచి శోభాయాత్రగా పెంచలకోనకు ఉత్సవమూర్తులు పెంచలస్వామి,ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి తరలిరానున్నారు.అనంతరం ఉత్సవాలకు వేదుకగా అంకురార్పణ జరుగుతుంది. రాత్రి సేనాపతి ఉత్సవం నిర్వహిస్తారు. 20న ఉదయం స్వామివారికి పట్టువస్త్రాల సమర్పణ జరుగుతుంది. ధ్వజారోహణం, రాత్రికి శేషవాహన సేవ, 21న ఉదయం హంస వాహనసేవ, రాత్రికి బంగారు హనుమంత సేవ, 22న ఉదయం సింహవాహన సేవ, రాత్రికి నృసింహ జయంతి సందర్భంగా బంగారు గరుడసేవ నిర్వహిస్తారు. 23న ఉదయం తిరుకల్యాణం, సాయంత్రం రథోత్సవం, రాత్రికి గజ వాహనసేవ జరుగుతాయి. 24న ఉదయం వసంతోత్సవం, చక్రస్నానం, సాయంత్రం తెప్పోత్సవం, రాత్రికి అశ్వవాహనసేవ, ధ్వజావరోహణం, 25న ఉదయం కోన నుంచి గోనుపల్లికి ఉత్సవమూర్తుల తిరుగు ప్రయాణం, రాత్రికి గ్రామోత్సవం జరుగుతాయి. శ్రీవారి భక్తులకు ప్రీతిపాత్రమైన లడ్డూలు, పులిహోర, దద్దోజనం, ప్రసాదాలు భక్తులకు అందజేయనున్నారు.డీఎస్పీ కోటారెడ్డి పర్యవేక్షణలో రాపూరు, సంగం, ఆత్మకూరు సీఐలతోపాటు 10 మంది ఎస్ఐలు, 250మంది సిబ్బంది బందోబస్తు నిర్వహిస్తారని రాపూరు ఎస్ఐ మాల్యాద్రి తెలిపారు.ఉత్సవాలకు నెల్లూరు, చిత్తూరు, కడప, తిరుపతి జిల్లాల నుంచి భారీ సంఖ్యలో ప్రజలు తరలిరానుండడంతో ఆయా ప్రాంతాల నుంచి 120 బస్సులు నడుపుతున్నట్లు రాపూరు ఆర్టీసీ డిపో మేనేజరు అనిల్ కుమార్ తెలిపారు.కోనలో భక్తులకు అన్ని సౌకర్యాలూ ఏర్పాటు చేశామని ఆలయ ఉపకమిషనర్ సాగర్‌బాబు తెలిపారు. ఆలయం వద్ద ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశామని,ఎండకు భక్తులు ఇబ్బంది పడకుండా చలువ పందిళ్లు వేశామని వివరించారు.

పట్టువస్త్రాలు ఎవరు సమర్పిస్తారు ?

స్వామివారికి గరుడసేవ రోజున ఎమ్మెల్యే పట్టువస్త్రాలు సమర్పించడం ఆనవాయితీ. అయితే ఈసారి కోడ్ అమలులో ఉండడంతో ఈ ఆనవాయితీ కొనసాగుతుందా.. లేదా అన్నది తెలియడం లేదు. శ్రీవారి కల్యాణం రోజున ముత్యాల తలంబ్రాలను ఆలయ చైర్మన్ సమర్పించేవారు. ఈసారి ఆలయ పాలక మండలి లేకపోవడంతో తలంబ్రాలు అందచేసే సంప్రదాయం ఉంటుందా... ఉండదా అని భక్తులు సందేహిస్తున్నారు.

తిరుపతి చేరిన సిట్ బృందం

ఎన్నికల కేసులపై నేడు విచారణ, పునఃసమీక్ష

తిరుపతి(నేరవిభాగం), మే 18 : ఎన్నికల పోలింగ్ రోజు, తర్వాత సంభవించిన హింసాత్మక ఘటనలపై విచారణ నిమిత్తం ఎన్నికల కమిషన్ నియమించిన స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్(సిట్) నేడు తిరుపతిలో విచారణ చేపట్టనుంది. తిరుపతి జిల్లాలో జరిగిన పలు హింసాత్మక ఘటనలపై లోతుగా విచారణ జరిపి, స్థానిక పోలీసు అధికారుల వైఫల్యాన్ని గుర్తించడంతో పాటు కేసుల నమోదులో అవసరమైన మార్పు చేర్పులు, సెక్షన్ల మార్పు చేర్పులను సూచించడం, శాంతిభద్రతల నిర్వహణకు సంబంధించిన అంశాలపై సిఫారసులు చేయనుంది.సిట్ బృందంలోని ఏసీబీ డీఎస్పీ రవిమనోహరాచారి, సీఐ ప్రభాకర్ శనివారం రాత్రి 12గంటలకు తిరుపతికి చేరుకున్నారు.ఆదివారం ఉదయం నుంచే వీరు దర్యాప్తు ప్రారంభిస్తారు.రామచంద్రాపురం మండలం బ్రాహ్మణకాలువ, పాకాల మండలం పులివర్తివారి పల్లి, చంద్రగిరి మండలం కూచువారి పల్లి, తిరుపతిలోని మహిళా వర్సిటీ వద్ద జరిగిన హింసాత్మక ఘటనలపై లోతుగా విచారించనున్నారు. వీటితో పాటు గూడూరు, వెంకటగిరి, చిల్లకూరు ప్రాంతాల్లో జరిగిన ఘర్షణలపైనా విచారణ చేపడతారు.వీటికి సంబంధించి నమోదైన ఎఫ్ఐఆర్‌లను పునః సమీక్షించనున్నారు.


హర్షవర్ధనరాజు

నేడు ఎస్పీ బాధ్యతల స్వీకరణ

తిరుపతి (నేరవిభాగం), మే 18 : తిరుపతి జిల్లా ఎస్పీగా హర్షవర్ధనరాజు నియమితులయ్యారు. ఆదివారం ఆయన తిరుపతికి చేరుకుని బాధ్యతలు చేపట్టనున్నారు. నెల్లూరు జిల్లా కావలికి చెందిన హర్షవర్ధన రాజు గ్రూప్-1 పరీక్షలు రాసి డీఎస్పీగా ఎంపికయ్యారు. అనంతరం నాన్ కేడర్ ఎస్పీగా పదోన్నతి పొందారు.విజయవాడ డీసీపీగా, అన్నమయ్య జిల్లా ఎస్పీగా పని చేశారు.ప్రతి సోమవారం ఎస్పీ కార్యాలయంలో జరిగే స్పందన కార్యక్రమానికి ప్రాధాన్యత ఇచ్చేవారని సమాచారం. ముక్కుసూటిగా పనిచేస్తారనే పేరుపడ్డ ఈయన్ను కేంద్ర ఎన్నికల సంఘం ఇటీవల బీహార్ ఎన్నికల అబ్జర్వర్‌గా నియమించింది.ప్రస్తుతం సీఐడీ విభాగం నుంచి తిరుపతి కి ఎస్పీగా రానున్నారు.

తిరుపతి కలెక్టర్‌కు రికార్డులు అప్పగించండి

ఎపిక్ కార్డుల కేసు విషయమై చిత్తూరు కలెక్టర్‌కు ప్రభుత్వ ఆదేశం

తిరుపతి, మే 18 (ఆంధ్రజ్యోతి) : మూడేళ్ల క్రితం జరిగిన తిరుపతి ఎంపీ ఉప ఎన్నికల సమయంలో చోటు చేసుకున్న ఎపిక్ కార్డుల అక్రమ డౌన్‌లోడ్ కేసులో రికార్డులను తిరుపతి కలెక్టర్ ప్రవీణ్‌కుమార్‌కు స్వాధీనం చేయాలని చిత్తూరు కలెక్టర్‌ను శనివారం సాధారణ పరిపాలనాశాఖ ముఖ్య కార్యదర్శి సురేష్‌కుమార్ ఆదేశించారు.తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గంలో సుమారు 36 వేల ఓటరు కార్డులను ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్ నుంచీ ఎలాంటి క్లైమ్‌లూ లేకుండా డౌన్‌లోడ్ చేసిన ఈ కేసులో బాధ్యులైన అధికారులపై శాఖాపరమైన విచారణకు ఆదేశించిన నేపథ్యంలో తిరుపతి కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ ప్రెజెంటింగ్ అధికారిగా వ్యవహరిస్తున్నారు. ఎన్నికలు తిరుపతిలో జరిగినప్పటికీ చిత్తూరు కలెక్టర్ ఉమ్మడి జిల్లా ఎన్నికల అధికారి హోదాలో మొత్తం పర్యవేక్షణ బాధ్యత వహించారు. సంబంధిత రికార్డులు చిత్తూరు కలెక్టరేట్‌లో వున్నాయి. అందువల్ల రికార్డులను తిరుపతి కలెక్టర్‌కు అప్పగించాలని శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

కొండెక్కిన కూరగాయలు



గూడూరు అర్బన్, మే 18: వేసవి ఎండల లాగే కూరగాయల ధరలు భగ్గుమంటున్నాయి. ఏమి కొందామన్నా 50రూపాయలకు మించి పలుకుతుండడంతో జనం బెంబేలెత్తి పోతున్నారు. వేసవి కావడం, డిమాండ్‌కు తగ్గ కూరగాయల ఉత్పత్తి లేకపోవడంతోనే కూరగాయల ధరలు కొండెక్కాయి. గూడూరులో శనివారం కిలో బీన్స్ రూ. 200, పందిరి చిక్కుడు రూ. 100, వంకాయలు రూ. 80, పచ్చిమిరపకాయలు రూ.60, క్యారెట్, బీట్‌రూట్, బెండకాయలు రూ. 70 చొప్పున ధర పలికాయి. ఆకు కూర కట్ట కొందామన్నా రూ. 20 పెట్టాల్సిందే.టమోటా, దోస, మునగ మాత్రమే రూ. 20 నుంచి 30 మధ్య లభిస్తున్నాయి.

అభ్యర్థుల ఖర్చు రూ. 635 కోట్లు!

ఇటీవల ముగిసిన సార్వత్రిక ఎన్నికల్లో జిల్లావ్యాప్తంగా ప్రధాన పార్టీల తరపున రూ. 635 కోట్లకు పైగా నిధుల వ్యయం జరిగింది. అధికార పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం రూ. 354 కోట్లకు పైగా ఖర్చు పెట్టగా టీడీపీ అభ్యర్థుల విజయం కోసం రూ. 277 కోట్లకు మించి ఖర్చు చేసినట్టు అంచనా. ఇక ఇతరులు పెట్టిన ఖర్చును కూడా పరిగణనలోకి తీసుకుంటే రూ. 4-5 కోట్ల వరకూ వుంటుందని సమాచారం. ఈ మొత్తంలో ఓటర్లను ప్రలోభపెట్టడానికే సింహభాగం నిధులు వెచ్చించినట్లు అంచనా. కాగా తిరుపతి, చంద్రగిరి, శ్రీకాళహస్తి నియోజకవర్గాల్లో ప్రధాన పార్టీల అభ్యర్థుల కోసం రూ. వంద కోట్లకు మించి ఖర్చు పెట్టినట్టు ప్రచారం జరుగుతుండగా వెంకటగిరిలో కూడా ఎన్నికల వ్యయం రూ. వంద కోట్లకు చేరువైనట్టు చెబుతున్నారు. ఇక జిల్లాలో నగరి పరిధిలోకి వచ్చే పుత్తూరు, వడమాలపేట మండలాల్లో కూడా ఇరు పార్టీల అభ్యర్థుల ఎన్నికల వ్యయం రూ. పాతిక కోట్లు దాటినట్టు అంచనా వేస్తున్నారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి



- రూ. 354 కోట్లు వెచ్చించిన వైసీపీ
- రూ. 277 కోట్లు ఖర్చు చేసిన టీడీపీ
- రూ. 4-5 కోట్లకు పైగా ఇతరుల వ్యయం
- ప్రలోభాలకే సింహభాగం ఖర్చు

సత్యవేడులో రూ. 65 కోట్ల పైమాటే

సత్యవేడు నియోజకవర్గంలో వైసీపీ తరపున చూస్తే ఓటర్లకు రూ. 25 కోట్ల నుంచీ రూ. 26 కోట్లు వెచ్చించినట్టు చెబుతున్నారు. అదే సమయంలో మద్యం కోసం ఏకంగా రూ. 5 కోట్లు ఖర్చు చేశారని, ప్రచారాలకు రూ. 15 లక్షలు, కేడర్‌కు రూ. 50 లక్షలు, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సభకు రూ. కోటి చొప్పున మొత్తం రూ. 35 కోట్ల వరకూ ఖర్చు చేసినట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. టీడీపీ వైపు నుంచీ ఓటర్లకు రూ. 20 కోట్లు, ప్రచారాలకు రూ. 10 లక్షలు, కేడర్‌కు రూ. 50 లక్షలు, చంద్రబాబు సభకు రూ. 20 లక్షల చొప్పున మొత్తం రూ. 25 కోట్లకు పైగా వెచ్చించినట్టు సమాచారం. కాగా ఇక్కడ ఓ స్వతంత్ర అభ్యర్థి తరపున ఓటర్లకు రూ.4 కోట్లు, ప్రచారాలకు రూ. కోటి వంతున రూ. 5 కోట్ల వరకూ ఖర్చు చేసినట్టు సమాచారం. మొత్తమ్మీద సత్యవేడులో ప్రధాన అభ్యర్థుల ఎన్నికల వ్యయం రూ. 65 కోట్లకు మించి వుంటుందని అంచనా.

గూడూరులో రూ. 50 కోట్లు

గూడూరు నియోజకవర్గంలో ఓటర్లను ప్రలోభపెట్టేందుకు రూ. 28 కోట్లు, ప్రచారాలకు రూ. 65 లక్షలు, పోలింగ్ రోజు రూ. 15 లక్షలు, కేడర్‌కు రూ. కోటి చొప్పున వైసీపీ మొత్తం రూ. 30 కోట్లు వెచ్చించినట్టు సమాచారం. అలాగే టీడీపీ ఓటర్లకు రూ. 17 కోట్లు, ప్రచారాలకు రూ. 72 లక్షలు, కేడర్‌కు రూ. 60 లక్షలు, చంద్రబాబు, బాలకృష్ణ సభలకు రూ. 25 లక్షల వంతున రూ. 20 కోట్లు ఖర్చు చేసినట్టు అంచనా. రెండు పార్టీలూ కలసి రూ. 50 కోట్లకు పైగా ఎన్నికల్లో వ్యయం చేసినట్టు ప్రచారం జరుగుతోంది.

సూళ్ళూరుపేటలో రూ. 50 కోట్ల దాకా

సూళ్ళూరుపేట నియోజకవర్గంలో అధికార పార్టీ అభ్యర్థి ఓటర్లకు పంపకాలకు రూ. 20 కోట్లు, మద్యానికి రూ. కోటి, ప్రచారాలకు రూ. 60 లక్షలు, సీఎం జగన్ సభకు రూ. 5 కోట్ల వంతున మొత్తం రూ. 26 కోట్ల నుంచీ రూ. 30 కోట్లు వెచ్చించినట్టు అంచనా వేస్తున్నారు. ఇక టీడీపీ అభ్యర్థి ఓటర్లకు రూ. 18 కోట్లు, ప్రచారాలకు రూ. 30 లక్షలు, చంద్రబాబు సభకు రూ. 2 కోట్ల వంతున రూ. 20 కోట్లకు పైగా ఖర్చు చేసినట్టు అంచనా వేస్తున్నారు. ఇక్కడ బీజేపీ తరపున రూ. 15 లక్షల దాకా ప్రచారానికి వ్యయం చేసినట్టు చెబుతున్నారు. మొత్తమ్మీద మూడు పార్టీలూ కలసి చేసిన ఎన్నికల వ్యయం రూ. 50 కోట్లకు చేరినట్లు సమాచారం.



తిరుపతిలో రూ. 130 కోట్లు

తిరుపతిలో ఓటర్లను ప్రలోభపెట్టేందుకు వైసీపీ వైపు నుంచీ ఓటుకు రూ. 2 వేల చొప్పున 2 లక్షల మంది ఓటర్లకు రూ. 40 కోట్లు, ప్రచారాలకు రూ. 20 కోట్లు, నాయకులు-కార్యకర్తలకు రూ. 5 కోట్లు, ఎన్నికల సభకు రూ. 50 లక్షల చొప్పున మొత్తం రూ. 65 కోట్ల నుంచీ రూ. 70 కోట్ల దాకా ఖర్చు చేసినట్టు అంచనా. ఇక టీడీపీ వైపు నుంచీ కూడా ఓటుకు రూ. 2 వేల చొప్పున 2 లక్షల మందికి రూ. 40 కోట్లు, ప్రచారాలకు రూ. 10 కోట్లు, కేడర్ కోసం రూ. 2 కోట్లు, అధినేతల సభలకు రూ. కోటి చొప్పున మొత్తం రూ. 60 కోట్ల వరకూ వ్యయం చేసినట్టు అంచనా. రెండు పార్టీలూ కలసి తిరుపతి నియోజకవర్గంలో రూ. 115 కోట్ల నుంచీ రూ. 130 కోట్ల వరకూ ఖర్చు చేసినట్టు తెలుస్తోంది.

శ్రీకాళహస్తిలో రూ. వంద కోట్లు దాటింది

శ్రీకాళహస్తి నియోజకవర్గంలో వైసీపీ తరపున పట్టణంలో ఓటర్లకు రూ. 3 వేల చొప్పున రూ. 22 కోట్లు, గ్రామీణ ప్రాంతాల్లో ఓటర్లకు రూ. 2 వేల వంతున రూ. 27 కోట్లు, చీరలు-ముక్కుపుడకలు-వెండి మెట్టెల పంపిణీకి రూ. 6.50 కోట్లు చొప్పున మొత్తం పంపకాలకే రూ. 56 కోట్ల దాకా వెచ్చించినట్టు సమాచారం. ఇక ప్రచారాలకు రూ. 3.50 కోట్లు, నామినేషన్ రోజే రూ. కోటి, మద్యానికి రూ. 50 లక్షలు, కేడర్‌కు రూ. 2 కోట్ల వంతున మొత్తం రూ. 65 కోట్లకు మించి ఖర్చుపెట్టినట్టు చెబుతున్నారు. టీడీపీ విషయానికొస్తే ఓటర్లకు రూ. 30 కోట్లు, ప్రచారాలకు రూ. 3.50 కోట్లు, కేడర్‌కు రూ. 2 కోట్లు, చంద్రబాబు సభకు రూ. కోటి చొప్పున రూ. 35 కోట్లకు పైగా ఎన్నికల వ్యయం చేసినట్టు సమాచారం. రెండు పార్టీలూ కలిపి రూ. వంద కోట్లు పైగానే ఖర్చు చేసినట్టు అంచనా.

వెంకటగిరిలో రూ. వంద కోట్లకు చేరువ

వెంకటగిరిలో వైసీపీ వైపు నుంచీ ఓటర్లకు రూ. 45 కోట్లు, ప్రచారాలకు రూ. 12 లక్షలు, కేడర్‌కు రూ. కోటి, సీఎం జగన్ సభకు రూ. కోటిన్నర చొప్పున మొత్తం రూ. 45 కోట్ల నుంచీ రూ. 50 కోట్ల దాకా ఖర్చు చేసినట్టు ప్రచారం జరుగుతోంది. ఇక టీడీపీ విషయానికొస్తే ఓటర్లకు కూ. 45 కోట్లు, ప్రచారాలకు రూ. 10 లక్షలు, కేడర్‌కు రూ. 70 లక్షలు, నందమూరి బాలకృష్ణ సభకు రూ. కోటి చొప్పున మొత్తం రూ. 45 కోట్ల నుంచీ రూ. 50 కోట్ల వరకూ వ్యయం చేసినట్టు చెబుతున్నారు. ఇరు పార్టీలూ ఎన్నికల్లో చేసిన వ్యయం రూ. వంద కోట్లకు చేరినట్టు చెబుతున్నారు.

నగరి రెండు మండలాల్లోనే రూ. 25 కోట్లు

నగరి నియోజకవర్గానికి సంబంధించి తిరుపతి జిల్లా పరిధిలో వున్న పుత్తూరు, వడమాలపేట మండలాల్లోనే వైసీపీ అభ్యర్థి విజయం కోసం వైసీపీ తరఫున ఓటర్లకు రూ. 15 కోట్లు, ప్రచారాలకు రూ. 15 లక్షలు, సీఎం జగన్ సభకు రూ. 2 కోట్లు వంతున రూ. 17 కోట్లకు పైగా వ్యయం చేసినట్టు చెబుతున్నారు. నియోజకవర్గవ్యాప్తంగా వైసీపీ తరపున 80 శాతం ఓటర్లకు రూ.2 వేల చొప్పున పంచారు.నోటిఫికేషన్ వచ్చినప్పటి నుంచే ఒక్కో బూత్‌కు రూ.6 వేల నగదు, రెండు కేసుల మద్యం అందించారు.టీడీపీ విషయానికొస్తే పుత్తూరు, వడమాలపేట మండలాల ఓటర్లకు రూ. 7.50 కోట్లు, ప్రచారాలకు రూ. 10 లక్షలు, చంద్రబాబు సభకు రూ. 80 లక్షలు వంతున రూ. 8 కోట్ల నుంచీ రూ. 10 కోట్ల వరకూ వెచ్చించినట్టు పార్టీల వర్గాల సమాచారం. మొత్తంగా ఇరు పార్టీల తరఫునా రూ. 25 కోట్లకు మించి వ్యయం జరిగినట్టు అంచనా. నియోజకవర్గవ్యాప్తంగా టీడీపీ కూడా ఓటుకు రూ.వెయ్యి చొప్పున పంపిణీ చేసింది. ప్రచారానికి ఒక్కో పోలింగ్ బూత్‌కు రూ.10 వేల చొప్పున అందజేసింది.

చంద్రగిరిలో రూ. 120 కోట్లకు పైగా

చంద్రగిరి నియోజకవర్గంలో వైసీపీ 80 శాతం అంటే 2.50 లక్షల మంది ఓటర్లకు రూ. 2 వేల చొప్పున రూ. 50 కోట్లు, మళ్ళీ ఇంటికి రూ. వెయ్యి వంతున 50 వేల ఇళ్ళకు మరో రూ. 5 కోట్లు, ప్రచారాలకు రూ. 6 కోట్లు, విందు, మందు రాజకీయానికి రూ. 5 కోట్లు... ఇలా మొత్తం రూ. 70 కోట్ల దాకా వెచ్చించినట్టు సమాచారం. టీడీపీ నుంచీ కూడా ఓటర్లకు పంపకాలకు రూ. 50 కోట్లు, ప్రచారాలకు రూ. 3 కోట్లు, నారా లోకేష్ సభకు రూ. కోటి చొప్పున మొత్తం రూ. 60 కోట్ల వరకూ ఖర్చు చేసినట్టు అంచనా. టీడీపీ తరపున అభ్యర్థితో నిమిత్తం లేకుండా స్థానిక నేతలు, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు, రియల్టర్లు, బిల్డర్లు స్వగ్రామాల్లో సొంతంగా ఖర్చు చేశారు. ఇరు పార్టీలూ కలసి రూ. 120 కోట్ల మేరకు ఖర్చు చేసినట్టు సమాచారం.

నేడు తిరుపతికి రెండు కంపెనీల కేంద్ర బలగాలు

తిరుపతి(నేరవిభాగం), మే 18 : కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఆదివారం తిరుపతికి రెండు కంపెనీల కేంద్ర బలగాలు వస్తున్నాయి.అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి సీఆర్‌పీఎఫ్ కంపెనీ, షార్ నుంచి మరో కంపెనీ సీఐఎస్ఎఫ్ బలగాలు రానున్నాయి.ఒక్కో కంపెనీలో 80 మంది సిబ్బంది వుంటారు. ఎన్నికల అనంతరం తిరుపతి, చంద్రగిరి ప్రాంతాల్లో చోటుచేసుకున్న అల్లర్లు, విధ్వంసాల నేపథ్యంలో రెండు కంపెనీల కేంద్ర బలగాలను ఈసీ తిరుపతికి పంపింది. స్ట్రాంగ్ రూముల వద్ద కాపలా విధుల్లో కొందరిని ,అల్లర్లు, ఘర్షణలు జరిగిన గ్రామాల్లో మరికొంతమందిని బందోబస్తు నిమిత్తం వాడుకుంటారు.

నాలుగు కేంద్రాల్లో రీ పోలింగ్ జరిపించండి

- ఎమ్మెల్యే చెవిరెడ్డి అభ్యర్థన
- ఈసీకి నివేదిస్తామన్న కలెక్టర్

తిరుపతి, మే 18 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరి నియోజకవర్గంలోని నాలుగు పోలింగ్ కేంద్రాల్లో రీ పోలింగ్ జరపాలని ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి కోరినట్టు సమాచారం. శనివారం కలెక్టరేట్‌కు వెళ్ళి జిల్లా ఎన్నికల అధికారి అయిన కలెక్టర్‌ను కలసిన చెవిరెడ్డి పాకాల మండలం నేలదానిపల్లికి చెందిన 64వ నంబరు పోలింగ్ కేంద్రం,రామచంద్రాపురం మండలం చిన్నరామాపురానికి చెందిన 110వ నంబరు పోలింగ్ కేంద్రం, చంద్రగిరి మండలం ఎగువ కాశిపెంట్లకు చెందిన 156వ నంబరు పోలింగ్ కేంద్రం,కల్‌రోడ్డుపల్లికి చెందిన 157వ నంబరు పోలింగ్ కేంద్రంలో రీ పోలింగ్ నిర్వహించాలని లిఖితపూర్వకంగా అభ్యర్థించినట్టు తెలిసింది.అయితే పోలింగ్ సిబ్బంది నుంచీ గానీ, ఇరు పార్టీలకు చెందిన ఏజంట్ల నుంచీ గానీ, పరిశీలకుల నుంచీ గానీ ఎలాంటి ఫిర్యాదులు లేనందున రీ పోలింగ్ విషయంలో తానేమీ చేయలేనని, విషయాన్ని ఈసీ దృష్టికి తీసుకెళతానని కలెక్టర్ స్పష్టం చేసినట్టు తెలిసింది. ఈసీ స్పందించని పక్షంలో హైకోర్టును ఆశ్రయించాలని చెవిరెడ్డి భావిస్తున్నట్టు సమాచారం.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

ఓటమి భయంతోనే వైసీపీ దాడులు: పాశం



పులివర్తి నానీని పరామర్శిస్తున్న సునీల్‌కుమార్

గూడూరు, మే 18: ఎన్నికల్లో ఓటమి భయంతోనే వైసీపీ నాయకులు టీడీపీ నాయకులపై దాడులకు పాల్పడుతున్నారని టీడీపీ అభ్యర్థి పాశం సునీల్‌కుమార్ అన్నారు. శనివారం తిరుపతిలో చంద్రగిరి టీడీపీ అభ్యర్థి పులివర్తి నానీని ఆయన నివాసంలో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నానీపై వైసీపీ శ్రేణులు దాడి చేస్తున్నా పోలీసులు పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. ఎన్నికల రోజు చిల్లకూరులో తనపై కూడా ఎస్‌ఐ అంజిరెడ్డి దౌర్జన్యానికి దిగారన్నారు. చింతవరంలో గోపాల్ అనే టీడీపీ కార్యకర్తపై వైసీపీ నాయకులు దాడి చేసి తీవ్రంగా గాయపరిచినా పోలీసులు ఈ కేసును నీరుకార్చేందుకు ప్రయత్నించడం వారి నిరంకుశ వైఖరికి నిదర్శనమని ఆరోపించారు.

మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీని కలసిన టీడీపీ నేతలు



పెళ్లకూరు, మే 18: శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడును మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యంతో కలసి పెళ్లకూరు టీడీపీ నేతలు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. శ్రీకాళహస్తిలోని ఆయన నివాసంలో టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, దామెర ప్రసాద్ నాయుడు, రాజగోపాల్‌రెడ్డి, సిద్ధులయ్య నాయుడు, మురళి నాయుడు, పరుశురామ్‌లు పూలమాలలు వేసి, శాలువాలతో ఎస్సీవీ నాయుడును ఘనంగా సత్కరించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 13న జరిగిన ఎన్నికల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పని చేశారని కొనియాడారు.

ఛలో వెంకటగిరి వాయిదా



మాట్లాడుతున్న కాలువపల్లి సహదేవయ్య

వెంకటగిరిటౌన్, మే 18: ఈ నెల 20వ తేదీన చేపట్టిన చలో వెంకటగిరి కార్యక్రమాన్ని వాయిదా వేసినట్లు దళిత సంఘ నాయకుడు కాలువపల్లి సహదేవయ్య తెలిపారు. శనివారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆయన మీడియాతో మాట్లాడుతూ పట్టణంలోని క్రాస్‌రోడ్డులో ఉన్న అంబేడ్కర్ విగ్రహాన్ని ఆగంతకులు ధ్వంసం చేసినందుకు నిరసనగా ఈ నెల 20వ తేదీన 20 దళిత సంఘాలతో కలిసి వెంకటగిరిలో మహాధర్నా నిర్వహించేందుకు నిర్ణయించామన్నారు. ఎన్నికల కోడ్ ఉన్నందున అధికారుల సూచన మేరకు జూన్ 6వ తేదీ తర్వాత ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఆయన చెప్పారు. పలువురు దళిత సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చలో వెంకటగిరికి మాదిగ ఉద్యోగ సంఘం దూరం

డక్కిలి, మే 18: వెంకటగిరిలో అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసినందుకు నిరసనగా దళిత సంఘాలు పిలుపునిచ్చిన చలో వెంకటగిరి కార్యక్రమానికి మాదిగ ఉద్యోగ సంఘం హాజరు కావడం లేదని ఆ సంఘం జిల్లా కార్యదర్శి పెంచలయ్య తెలిపారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో వున్న దృష్ట్యా ఈనెల 20వ తేదీన నిర్వహించనున్న కార్యక్రమానికి ఉద్యోగులంతా దూరంగా ఉండాలని నిర్ణయించుకొన్నట్లు తెలిపారు. అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసి 10రోజులు కావస్తున్నా పోలీసులు నిందితులను పట్టుకోలేకపోవడం శోచనీయమన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి భరత్ కమల్

కోట, మే 18: చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని స్థానిక జూనియర్ సివిల్ జడ్జి భరత్ కమల్ కోరారు. కోట పట్టణ పరిధిలోని శ్రీలక్ష్మమ్మ కాలనీలో శనివారం న్యాయ విజ్ఞాన చైతన్య సదస్సు జరిగింది. న్యాయమూర్తి భరత్‌కమల్ స్థానికులకు చట్టాలపై అవగాహన కల్పించారు. చట్టాలపై అవగాహన లేని కారణంగా ఎన్నో సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటరమణమ్మ, ఎస్‌ఐ నాగబాబు, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

వైభవంగా వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణం



వేదపండితులకు పూలదండలు అందచేస్తున్న నిర్వాహకులు

సూళ్లూరుపేట, మే 18: సూళ్లూరుపేటలోని జీఎన్‌టీ రోడ్డులో ఉన్న పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వామి మఠంలో జరిగే ఆరాధనోత్సవాల్లో భాగంగా శనివారం రెండోరోజు స్వామివారి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. మఠం ముందు ఏర్పాటు చేసిన కల్యాణ వేదిక వద్ద స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ఏర్పాటు చేసి వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ నిర్వాహకులు చిట్టేటి పెరుమాల్ దంపతుల ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఉదయం మూలవర్లకు అభిషేకం నిర్వహించి, పుష్పాలతో అలంకరించారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. కమిటీ సభ్యులు చెంగయ్య, సుబ్రమణ్యం యాదవ్, నూలేటి రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు మంచి నీటి సరఫరాకు అంతరాయం

వెంకటగిరిటౌన్, మే 18: మున్సిపాలిటీలోని 25వార్డుల్లో ఆదివారం మంచి నీటి సరఫరాకు అంతరాయం ఉంటుందని మున్సిపల్ కమిషనర్ రషీద్ శనివారం తెలిపారు. శుక్రవారం కురిసిన భారీ వర్షానికి ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు గురైందని, ఆదివారం బాగు చేస్తున్నామని తెలిపారు. ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

కారు ఢీకొని పాదచారి మృతి



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ శ్రీకాంత్

పెళ్లకూరు, మే 18: మండలంలోని చెంబడిపాలెం వద్ద 71వ జాతీయ రహదారిపై శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు నెల్లూరు వెంకటేశ్వరపురం సమీపంలోని భగత్‌సింగ్ కాలనీకి చెందిన అలిషేర్ (45) రోడ్డుపై నడచి వెళ్తుండగా, చెంబడిపాలెం వద్ద నాయుడుపేట నుంచి శ్రీకాళహస్తి వైపు వెళ్తున్న కారు వెనుక వైపు నుంచి ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో అలీషేర్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ శ్రీకాంత్ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడు బేల్దార్ పనులు చేసుకుని జీవనం సాగించేవాడు. భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

26 నుంచి పోలేరమ్మ జాతర



పోలేరమ్మ గుడి

నాయుడుపేట, మే 18: నాయుడుపేట గడియారం సెంటర్‌లో వెలసి ఉన్న పోలేరమ్మ 49వ జాతర మహోత్సవం ఈ నెల 26వ తేదీ ఆదివారం నుంచి ప్రారంభమవుతుంది. 26వ తేదీన ఘటోత్సవం, 28న రాత్రి అమ్మవారి నిలుపు, 29న అమ్మవారి నిమజ్జనోత్సవం, 31న శుక్రవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

విజయోత్సవ ర్యాలీలకు
అనుమతి లేదు: డీఎస్పీ

తడ, మే 18: వచ్చే నెల 4వ తేదీన ఓట్ల లెక్కింపు అనంతరం గెలిచిన పార్టీ అభ్యర్థి మద్దతుదారులు ఎటువంటి విజయోత్సవ ర్యాలీలు నిర్వహించడం, టపాకాయలు కాల్చడం వంటి వాటికి అనుమతి లేదని నాయుడుపేట డీఎస్పీ శ్రీనివాసులురెడ్డి అన్నారు. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన మత్స్యకార నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నిబంధనలు అమలులో ఉంటాయని, ప్రజలు సహకరించాలని కోరారు. సూళ్లూరుపేట సీఐ మధుబాబు, స్థానిక ఎస్‌ఐ నరసింహారావు పాల్గొన్నారు.

ఉచిత ఖత్నా కార్యక్రమాన్ని
సద్వినియోగం చేసుకోవాలి

గూడూరు అర్బన్, మే 18: స్థానిక షాదీమంజిల్‌లో ఈనెల 27వ తేదీన ఇన్సాఫ్‌కమిటీ, మైనార్టీల ఆధ్వర్యంలో నిర్వహించనున్న సామూహిక ఉచిత ఖత్నా కార్యక్రమాన్ని పట్టణ, పరిసర ప్రాంతాల్లోని ముస్లింలు సద్వినియోగం చేసుకోవాలని ఇన్సాఫ్‌కమిటి ప్రతినిధి జమాలుల్లా అన్నారు. శనివారం స్థానిక షాదీమంజిల్ ఇన్సాఫ్‌కమిటీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. కాలేషా, అన్వర్‌బాషా, హసీం, యస్దానీ, నయూం, ఇబ్రహీం, రఫీ పాల్గొన్నారు.

యాదవ విద్యార్థులకు
ప్రతిభా పురస్కారాలు

గూడూరు అర్బన్, మే 18: పదో తరగతిలో ప్రతిభచాటిన యాదవ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేయనున్నట్లు శ్రీకృష్ణసేవాసమితి అధ్యక్షుడు మయూరి శ్యామ్‌యాదవ్ శనివారం పేర్కొన్నారు. ఉమ్మడి నెల్లూరుజిల్లాలోని గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాల్లో పదో తరగతిలో 475కు పైగా మార్కులు సాధించిన యాదవ విద్యార్థులకు ఈనెల 26వ తేదీన నెల్లూరులోని జెట్టి శేషారెడ్డి విజ్ఞానకేంద్రంలో యాదవ ఎంప్లాయిస్, ప్రొఫెషనల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాలను అందజేస్తారని తెలిపారు. వివరాలకు 99486 06664, 97058 00794 నెంబర్లను సంప్రదించాలన్నారు.

కోళ్లు పంపిణీ చేసిన వారిపై
చర్యలు తీసుకోవాలి



పంపిణీ చేసేందుకు కోళ్లను తీసుకెళ్తున్న దృశ్యం (ఫైల్‌ఫొటో)

సూళ్లూరుపేట, మే 18: మండల పరిధిలోని మంగానెల్లూరులో ఓటర్లను ప్రలోభాలకు గురిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని సర్పంచ్ కాటూరి శేఖర్ అన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పోలింగ్ ముందు రోజు గ్రామంలో అధికార పార్టీ వారు ఇంటింటికీ కోళ్లు పంపిణీ చేసి ఓటర్లను ప్రలోభాలకు గురిచేశారన్నారు. ఈ విషయాన్ని గ్రామస్తులు కొంతమంది ఎంసీసీకి తెలపడంతో, పంచాయతీ కార్యదర్శి వేనాటి రాజారెడ్డి ఆధ్వర్యంలో గ్రామ స్థాయి ఉద్యోగులు రెండు రోజుల క్రితం విచారణ చేపట్టారన్నారు. అధికార పార్టీ నాయకులను కలిసిన విచారణ అధికారులు ఉల్లంఘన ఏమీ జరగలేదని, గ్రామంలో ఎవరూ కోళ్లు ఇంటింటికీ పంపిణీ చేయలేదని.. పంపిణీ చేసిన వ్యక్తులతోనే సంతకాలు చేయించుకున్నారని తెలిపారు. మా గ్రామంలో ప్రతి ఇంటికి కోళ్లు పంపిణీ చేసిన మాట వాస్తమేనని సంబంధిత అధికారులకు తెలిపినా పట్టించుకోకుండా, అదేమి జరగలేదని తూతుమంత్రంగా విచారణ చేయడం తగదన్నారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్, ఆర్వో, ఏఈఆర్వోలకు సోమవారం ఫిర్యాదు చేయనున్నట్లు ఆయన తెలిపారు.

మహిళా వర్సిటీలో.. కౌంటింగ్ కేంద్రాల వివరాలివీ....

తిరుపతి(కలెక్టరేట్), మే 18: వచ్చే నెల 4న జరగనున్న ఓట్ల లెక్కింపు ప్రక్రియలో 700మంది సిబ్బంది పాలుపంచుకుంటారు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ, ఒక పార్లమెంటు నియోజకవర్గానికి సంబంధించి తిరుపతిలోని మహిళా యూనివర్శిటీ ప్రాంగణంలో వున్న ఇంజనీరింగ్ కళాశాలలో కౌంటింగు జరుగుతుంది. ప్రతి నియోజకవర్గానికీ ఒక్కో బ్లాక్‌ను కేటాయించారు. 6 అసెంబ్లీ సెగ్మెంట్లకు 14, పార్లమెంటుకు 14 వంతున టేబుళ్లు ఏర్పాటు చేస్తున్నారు. చంద్రగిరి నియోజకవర్గంలో పోలింగ్ కేంద్రాలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో అసెంబ్లీకి 20, పార్లమెంటుకు 20 టేబుళ్ల వంతున ఏర్పాటు చేయనున్నారు. అసెంబ్లీ, పార్లమెంటుకు కలిపి ఈవీఎం బ్యాలెట్‌కు 208 టేబుళ్లను, పోస్టల్ బ్యాలెట్‌కు 23 టేబుళ్లు, సర్వీసు ఓట్లరకు ఏడు టేబుళ్లు ఏర్పాటు చేస్తున్నారు. టేబుల్‌కు ఒక సూపర్‌వైజర్, ఇద్దరు కౌంటింగ్ అసిస్టెంట్లు, ఒక మైక్రో అబ్జర్వర్ విధుల్లో ఉంటారు. గూడూరు అసెంబ్లీకి విశ్వేశ్వరయ్య బ్లాక్ మూడవ అంతస్తు, రూమ్ నెంబరు 407, పార్లమెంటు ఓట్లకు సంబంధించి అదే బ్లాక్‌లో రూమ్ నెంబరు 406 కేటాయించారు. సూళ్ళూరుపేట అసెంబ్లీకి విశ్వేశ్వరయ్య బ్లాక్ రెండవ అంతస్తు గది నెంబరు 306, పార్లమెంట్‌కు రూమ్ నెంబరు 307 కేటాయించారు. వెంకటగిరి అసెంబ్లీకి సీవీ రామన్ బ్లాక్, గ్రౌండ్‌ఫ్లోర్, రూమ్ నెంబరు 101, పార్లమెంటుకు విశ్వేశ్వరయ్య బ్లాక్ రెండవ అంతస్తు, రూమ్ నెంబరు 307 కేటాయించారు. చంద్రగిరి అసెంబ్లీకి కేఎల్‌రావు బ్లాక్, 1వ అంతస్తు, లైబ్రరీ హాల్, పార్లమెంట్‌కు సంబంధించి కేఎల్‌రావు బ్లాక్, గ్రౌండ్‌ఫ్లోర్, ధృతి మల్టీ పర్పస్ హాల్ కేటాయించారు. తిరుపతి అసెంబ్లీకి సంబంధించి సీవీ రామన్ బ్లాక్, 2వ అంతస్తు, రూమ్ నెంబరు 312ఎ, పార్లమెంటుకు సంబంధించి సీవీరామన్ బ్లాక్, 2వ అంతస్తు, రూమ్ నెంబరు 301 కేటాయించారు. శ్రీకాళహస్తి అసెంబ్లీకి సంబంధించి విశ్వేశ్వరయ్య బ్లాక్ మొదటి అంతస్తు, రూమ్ నెంబరు 206, పార్లమెంటుకు సంబంధించి విశ్వేశ్వరయ్య బ్లాక్, మొదటి అంతస్తు, రూమ్ నెంబరు 207 కేటాయించారు. సత్యవేడు అసెంబ్లీకి సంబంధించి సీవీ రామన్ బ్లాక్, 3వ అంతస్తు, రూమ్ నెంబరు 403, పార్లమెంటుకు సంబంధించి సీవీ రామన్ బ్లాక్, 3వ అంతస్తు, రూమ్ నెంబరు 410లో ఓట్ల లెక్కింపు జరగనుంది. పోస్టల్ బ్యాలెట్ విషయానికి వస్తే గూడూరు అసెంబ్లీకి సంబంధించి విశ్వేశ్వరయ్య బ్లాక్ మూడవ అంతస్తు, రూమ్ నెంబరు 407, సూళ్ళూరుపేటకు విశ్వేశ్వరయ్య బ్లాక్ రెండవ అంతస్తు, రూమ్ నెంబరు 306, వెంకటగిరికి సీవీ రామన్ బ్లాక్, గ్రౌండ్‌ఫ్లోర్ రూమ్ నెంబరు 101, చంద్రగిరికి కేఎల్‌రావు బ్లాక్,మొదటి అంతస్తు, లైబ్రరీ హాల్, తిరుపతికి సీవీ రామన్ బ్లాక్, రెండవ అంతస్తు, రూమ్ నెంబరు 312ఏ, శ్రీకాళహస్తికి విశ్వేశ్వరయ్య బ్లాక్, రూమ్ మొదటి అంతస్తు, నెంబరు 206, సత్యవేడుకు సంబంధించి సీవీ రామన్ బ్లాక్, 3వ అంతస్తు రూమ్ నెంబరు 403లో ఓట్ల లెక్కింపు జరుగుతుంది. పార్లమెంట్ పరిధిలోని పోస్టల్‌బ్యాలెట్ లెక్కింపు సీవీ రామన్ బ్లాక్, గ్రౌండ్ ఫ్లోర్ రూమ్ నెంబరు 111లో జరుగుతుంది.

అడుగడుగునా... అక్రమ స్పీడ్ బ్రేకర్లు

● రాకపోకలతో వాహనచోదకులకు ఒళ్లు హూనం



రామకృష్ణాపురంలో ఎత్తుగా, చిన్నదర్గా వీధి కూడలిలో అస్తవ్యస్తంగా ఉన్న ఉన్న అక్రమ స్పీడ్ బ్రేకర్లు

నాయుడుపేట, మే 18: పట్టణంలోని ప్రతి వీధిలోనూ పరిమితికి మించి ఎత్తుగా అక్రమ స్పీడ్ బ్రేకర్లు అడుగడుగునా ఉన్నాయి. విద్యాలయాలు, ప్రార్థనా మందిరాలు, ప్రమాద స్థలాల వద్దమాత్రమే స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయాల్సి ఉంది. స్పీడ్ బ్రేకర్లు నిబంధనల ప్రకారం ఎత్తు 6 ఇంచులు, వెడల్పు 11 ఇంచులతో ఏటవాలుగా ఇరువైపులా వాహనాల రాకపోకలకు అనువుగా ఉండాలి. అందుకు భిన్నంగా నాయుడుపేట పట్టణంలోని స్పీడ్ బ్రేకర్లు ఉన్నాయి. ఇంటి డ్రైనేజీ పైపులను రోడ్డులో గుంటలుతీసి అమర్చి రోడ్డుకు సమాంతరంగా ఏర్పాటు చేయాలి. పలువురు డ్రైనేజీ పైపులను సిమెంట్ రోడ్డుపైన ఏర్పాటు చేసి ఆపై కాంక్రీట్‌తో ఎత్తుగా స్పీడ్ బ్రేకర్లుగా అమర్చుతున్నారు.

రాకపోకలతో వాహనచోదకులకు ఒళ్లు హూనం

పట్టణంలోని ప్రధాన వీధులతోపాటు అన్ని వీధుల్లో పరిమితికి మించి ఎత్తుగా స్పీడ్ బ్రేకర్లు ఉన్నాయి. దీంతో వాహనాల అడుగుభాగాన ఛిద్రమవుతువుతున్నాయి. ద్విచక్ర వాహనదారులకు ఒళ్లు హూనం కావడంతోపాటు తరచూ ప్రమాదాల బారినపడి తీవ్ర గాయాలపాలవుతున్నారు.

భక్తిశ్రద్ధలతో కన్యకా పరమేశ్వరి జయంతి పూజలు



గూడూరులో కలశాలను ఊరేగిస్తున్న మహిళలు, కోటలో నెమలి పింఛం చీర అలంకారంలో వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు, సూళ్లూరుపేటలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

గూడూరు, మే 18: పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో శనివారం అమ్మవారి జయంతి సందర్భంగా పూజలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు జరిపారు. స్థానిక శివాలయం నుంచి 102 కలశాలతో ఊరేగింపుగా అమ్మవారి దేవస్థానానికి చేరుకుని సాంప్రదాయబద్ధంగా అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు.

కోట: పట్టణంలో వెలసి ఉన్న వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో శనివారం అమ్మవారి జయంతి వేడుకలు కన్నుల పండువగా జరిగాయి. ఆలయ పాలకమండలి ఆధ్వర్యంలో ఆలయ ప్రధానార్చకుడు మార్కెండేయస్వామి పర్యవేక్షణలో అమ్మవారికి అభిషేకాలు జరిగాయి. అమ్మవారిని నెమలి పింఛం చీరతో అలంకరించారు. పట్టణంలోని ఆర్టీసీ సెంటర్ నుంచి భక్తులు మేళతాళాలతో అమ్మవారి ఆలయం వరకు ఊరేగింపుగా కలశాలను తీసుకువచ్చి ప్రత్యేక హోమం నిర్వహించారు. ఆర్యవైశ్య మహిళా భక్తులు భజనలతో అమ్మవారికి చీర, సారె తీసుకువచ్చి అలంకరించారు.

సూళ్లూరుపేట: సూళ్లూరుపేటలో వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించుకొన్నారు. బాహూజివీధిలో వాసవి, వనిత క్లబ్‌ల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం కన్యకాపరమేశ్వరి ఆలయం వద్ద నుంచి పల్లకిలో అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించారు. వాసవి, వనిత క్లబ్‌ల నిర్వాహకులు సాయిరామ్, సునీత, నూతలపాటి శ్రీనివాసులు, రమేష్, పద్మజ, శైలజ, వాణి తదితరులు పాల్గొన్నారు.

చర్చిలో పోలీసులు దౌర్జన్యం చేయడం తగదు



మాట్లాడుతున్న ఇశ్రాయిల్‌కుమార్

గూడూరు, మే 18: స్థానిక అరుంధతీయపాళెంలోని యోరూషలేం ప్రార్థనా మందిరంలో పోలీసులు అనుచితంగా వ్యవహరించడం మంచిపద్ధతి కాదని పార్లమెంటు టీడీపీ క్రిస్టియన్‌సెల్ అధ్యక్షుడు ఇశ్రాయిల్‌కుమార్ విమర్శించారు. శనివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆ పార్టీ క్రిస్టియన్‌సెల్ ఆధ్వర్యంలో పాస్టర్స్ అసోసియేషన్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ శుక్రవారం యోరూషలేం ప్రార్థనామందిరంలో పాస్టర్‌గా పనిచేస్తున్న ప్రభుదాస్, ఆయన సతీమణి జ్యోతి వద్దకు పోలీసులు వచ్చి మీ చర్చిలో గంజాయి వున్నట్లు సమాచారం అందిందని, చర్చి తాళాలు తీయాలని దౌర్జన్యంగా వ్యవహరించారని ఆరోపించారు. పవిత్ర ప్రార్థనా మందిరంలోకి పోలీసులు ప్రవేశించి సోదాలు జరిపినా ఏమి దొరకలేదని, తప్పుడు సమాచారంతో సోదాలు జరపడంపై ఎన్నికల కమిషన్ అధికారులకు, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. పాస్టర్ ప్రభుదాస్ మాట్లాడుతూ పోలీసులు దైవసేవకులను ఇలా అవమానించడం తగదన్నారు. డేవిడ్, రత్నశేఖర్, జయరాజ్, జార్జి, విజయ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

శాంతి స్వరూపిణి అలంకారంలో
ఊరేగిన కోటమ్మ అమ్మవారు



కోట, మే 18: మండల పరిధిలోని తిన్నెలపూడిలో గ్రామ దేవత కోటమ్మ ఉత్సవాల్లో భాగంగా చివరి రోజైన శనివారం అమ్మవారు శాంతి స్వరూపిణి అలంకారంలో ఊరేగారు. తిన్నెలపూడి, నారుమిట్ట గిరిజనకాలనీ, దళితవాడల్లో అమ్మవారు సకల జనులను కాపాడుతామంటూ శాంతి స్వరూపిణి అలంకారంలో ఊరేగుతుండగా, భక్తులు అడుగడుగున కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. మహిళా భక్తులు మంగళహారతులు పట్టారు. తెనాలి బృందం వారి కోలాట దృశ్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి. భక్తులకు నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

దుస్థితిలో ప్రభుత్వ భవనాలు

● భయాందోళనలో సిబ్బంది, ప్రజలు



శిథిలావస్థలో ఉన్న తహసీల్దార్ కార్యాలయం, పశువైద్యశాల భవనాలు

బాలాయపల్లి, మే 18: ప్రజా సమస్యల పరిష్కార నిలయాలైన పలు ప్రభుత్వ కార్యాలయ భవనాలు దుస్థితికి చేరుకున్నాయి. ఈ భవనాలను తొలగించి నూతన భవనాలను నిర్మిచాల్సిన పాలకులు కూడా పట్టించుకోక పోవడంతో అధ్వానంగా ఉన్నాయి. దీంతో సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాలకు వచ్చే ప్రజలతో పాటు సిబ్బంది కూడా భయాందోళన చెందాల్సిన పరిస్థితి నెలకొంది.

ప్రధానంగా స్థానిక తహసీల్దార్ కార్యాలయం, పశువైద్యశాల భవనాలు కూలిపోయే స్థితిలో ఉన్నాయి. ప్రస్తుత ప్రభుత్వం సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు, గ్రామీణ ఆరోగ్యకేంద్రాలు నిర్మిస్తున్నప్పటికీ దుస్థితికి చేరుకుని ప్రజలకు హాని కలిగించే పలు కార్యాలయ భవనాల గురించి పట్టించుకోవడంలేదనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. నిత్యం మండలంలోని ప్రజలు ఆయా సమస్యల పరిష్కారం కోసం తహసీల్దార్ కార్యాలయానికి వస్తుంటారు. అయితే తహసీల్దార్ కార్యాలయ భవనం దుస్థితికి చేరుకుని పెచ్చులూడి పడిన సంఘటనలు ఉన్నాయి. దీంతో కార్యాలయానికి వచ్చిన ప్రజలు ఎప్పుడు ఎవరిపై పెచ్చులూడి పడతాయోనన్న భయాందోళన వ్యక్తం చేస్తుండటంతో పక్కనే ఉన్న కమ్యూనిటీ భవనంలోకి తహసీల్దార్ కార్యాలయాన్ని తాత్కాలికంగా మార్పు చేసి చేతులు దులుపుకున్నారు. ఈ కార్యాలయం గది ఇరుకుగా ఉండటంతో ఆర్‌ఐ, వీఆర్వోలు దుస్థితిలో ఉన్న భవనంలోనే కూర్చుని విధులు నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. అదేవిధంగా పశు వైద్యశాల భవనం పురాతనమైనది కావడంతో శిథిలావస్థకు చేరుకుని కూలేందుకు సిద్ధంగా ఉంది. దీంతో పాడి రైతులు పశువులను తీసుకుని వైద్యశాలకు రావాలంటే భయపడుతున్నారు. చిన్నపాటి వర్షం వచ్చినా ఆయా కార్యాలయాల్లోని సామగ్రి తడిసి ముద్దవుతున్నాయని వాపోతున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి దుస్థితిలో ఉన్న భవనాలను తొలగించి నూతన భవనాలు నిర్మించాలని సిబ్బంది, ప్రజలు కోరుతున్నారు.

ఎన్నికల విధులకు 228 మంది డుమ్మా

● షోకాజ్ నోటీసులు జారీ

చిత్తూరు కలెక్టరేట్, మే 18: ఎన్నికల విధులకు గైర్హాజరైన 228 మందిపై చిత్తూరు జిల్లా యంత్రాంగం సీరియస్ అయ్యింది. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పలు ప్రభుత్వశాఖల్లో పని చేస్తున్న ఉద్యోగులను ఎన్నికల విధుల్లో నియమిస్తూ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షన్మోహన్ ఉత్తర్వులు జారీచేశారు. ఆ ఆదేశాలను ధిక్కరిస్తూ 36 మంది పీవోలు, 22మంది ఏపీవోలు, 170 మంది ఓపీవోలు విధులకు డుమ్మా కొట్టారు. విధులకు గైర్హాజరైన వారి స్థానంలో రిజర్వులు ఉన్న వారి సేవలు పొంది ఎన్నికలు పనులు పూర్తిచేశారు. గైర్హాజరైన 228మందికి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పేరిట షోకాజ్ నోటీసులు జారీ అయ్యాయి. విధులకు ఎందుకు గైర్హాజరయ్యారో తెలుపుతూ షోకాజ్ నోటీసు అందిన 48 గంటల్లో కలెక్టరేట్‌కు సమాధానం పంపాలని ఆ ఉత్తర్వులో పేర్కొన్నారు. కాగా, షోకాజ్ నోటీసులు అందుకున్న వారిలో చాలా మంది ఉపాధ్యాయులుండగా, వారిని తొలుత ఓ నియోజకవర్గంలో విధులు కేటాయించి, ఆ తర్వాత మరో నియోజకవర్గానికి విధులు కేటాయించడం, కొందరు దీర్ఘకాలిక వ్యాధులతో తాము ఎన్నికల విధులకు హాజరుకాలేమంటూ గతంలోనే విన్నవించుకున్నా కూడా వారికి కూడా విధులు కేటాయించడం వంటివి జరిగినట్లు తెలిసింది.

పెళ్లిచూపులకు వస్తూ..
రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఇంజనీరు మృతి



కంటైనర్‌ను ఢీ కొన్న కారు, సందీప్ (ఫైల్‌ఫొటో)

చంద్రగిరి, మే 18: పెళ్లి చూపుల కోసం వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. రేణిగుంట మండలం ఆర్.మల్లవరానికి చెందిన పి.బాలసుబ్రమణ్యం కుమారుడు సందీప్ (31) బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. ఇంట్లో కుటుంబ సభ్యులు పెళ్లి సంబంధాలు చూస్తున్నారు. ఈ క్రమంలో పెళ్లి చూపులకు రావాలని తల్లిదండ్రులు చెప్పారు. దీంతో అతడు శుక్రవారం రాత్రి బెంగళూరు నుంచి కారులో స్వగ్రామానికి బయలుదేరాడు. శనివారం తెల్లవారు జామున చంద్రగిరి మండలం, ఐతేపల్లి వద్ద పూతలపట్టు - నాయుడు పేట జాతీయ రహదారిలో ముందు వెళుతున్న కంటైనర్‌ను అదుపు తప్పి ఢీకొన్నాడు. కారు నుజ్జునుజ్జయింది. సందీప్ అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా మృతుడు గతంలో అమెరికాలో ఉద్యోగం చేస్తూ తన వివాహం కోసమే స్వదేశానికి వచ్చినట్లు సమాచారం.